ఆశాల పెండింగులో ఉన్న కరోనా అలవెన్సులు తక్షణం ఇవ్వాలి

విశాలాంధ్ర-కడప రూరల్ : రాష్ట్రంలోని ఆశా కార్యకర్తలకు గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న అలవెన్స్‌ల మొత్తాలను తక్షణం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు మరియు ఆశా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు గుంటి. వేణుగోపాల్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆశా కార్యకర్తలకు ఇవ్వవలసిన టిఏ, డిఏ, మలేరియా, టీబి, కరోనా అలవెన్సులు పూర్తిగా ఇవ్వడం లేదని ఇవ్వాలని అధికారులను అడిగితే ఆశాలకి ఇచ్చే పదివేల వేతలమే కానీ ఇంక ఇతర అలవెన్స్ ఏవి ఇచ్చేటువంటి పరిస్థితి లేదని అధికారులు తెలియజేస్తున్నారన్నారు. కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతినెల 1000 రూపాయలు ప్రకారం ఆరు నెలల ప్రత్యేక అలవెన్సు కేంద్ర ప్రభుత్వం ఇచ్చినా, రాష్ట్ర ప్రభుత్వం దాన్ని ఆశాలకు ఇవ్వలేదన్నారు. 26 పనులు కాకుండా అదనంగా ఆశాలకు సంబంధం లేని అనేక పనులను చేస్తున్నారని అన్నారు. ఆశాల పెండింగ్‌లో ఉన్న మలేరియా, టిబి, కరోనా అలవెన్సులన్నింటినీ తక్షణం విడుదల చేయకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అధికారులను హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏపీ ఆశా వర్కర్ యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు ఏ.లక్ష్మీనరసమ్మ, బి.శాంతమ్మలు పాల్గొన్నారు.

1998 డిఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర -కడప : 1998 డీఎస్సీలో క్వాలిఫై కాబడి సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించి మిగిలిపోయిన 2200మంది అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చి ప్రభుత్వం న్యాయం చేయాలని వారు కోరారు. చెన్నూరులో శుక్రవారం1998 క్వాలిఫైడ్ అభ్యర్థులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఎంటిఎస్ పద్ధతిలో ఉద్యోగాలు ఇచ్చేందుకు 6782 మంది క్వాలిఫై అభ్యర్థులను వెరిఫికేషన్ చేసి కేవలం 4072 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. మిగిలిపోయిన వారికి ఉద్యోగాలు ఇవ్వడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని వారు ఆవేద వ్యక్తం చేశారు. ఈ విషయమై పలుమార్లు వివిధ రకాలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన ప్రయోజనం లేదన్నారు. మిగిలిపోయిన వారిలో బిసి, ఎస్సీ, ఎస్టి, మైనారిటీ, వికలాంగులు ఓసీలు మరియు మహిళలు ఉన్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారికి ఉద్యోగాలు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డీఎస్సీ నాన్ జాయినింగ్ అభ్యర్థులు ఏవి గురు ప్రసాద్, కే శ్రీనివాసులు, జాకీర్ హుస్సేన్, ఎ.శ్రీనివాసులు, కెవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పొడిగింపునకు వినతి

విశాలాంధ్ర-యర్రగుంట్ల : స్థానిక రైల్వేస్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని రైల్వే లైన్లకు రెండువైపులా పొడిగించి ప్రయాణీకులకు సౌకర్యం కల్పించాలని కోరుతూ శుక్రవారం సీపీఐ నాయకులు గుంతకల్లులో రైల్వే ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏడీఎఫ్ఎం సూర్యనారాయణను తాము కలుసుకొని ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లోని పలు సమస్యలను వివరించినట్లు తెలిపారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జితో పాటు రైల్వేస్టేషన్‌లో ప్రయాణీకులకు అవసరమైన సదుపాయాల కల్పనపై వినతి చేశామన్నారు. త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సూర్యనారాయణ హామీ ఇచ్చినట్లు సుబ్బారెడ్డి తెలిపారు.

నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలి

విశాలాంధ్ర-పులివెందుల: పట్టణ పరిధిలో నీటి సరఫరాకు ఎక్కడా అంతరాయం లేకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ సిబ్బందికి సూచించారు. పులివెందుల పట్టణంలో శుక్రవారం ఆయన వైస్ చైర్మన్ యస్ హాపీ జిల్లా మునిసిపల్ కమిషనర్ వి వి నరసింహా రెడ్డి గారితో కలిసి సచివాలయం అమేనిటి సెక్రెటరీలు మరియు నీటి సరఫరా సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణములో ఎక్కడేగాని నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా విధులు నిర్వహించాలన్నారు. అక్రమ కొళాయి కనెక్షన్లను రెగ్యులర్ చేయించమని ఇప్పటికే పలుమార్లు సిబ్బందికి సూచించా మన్నారు. ఇంతవరకు సదరు కార్యక్రమ పురోగతిని తన దృష్టికి రాలేదన్నారు. విధులు యందు నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీరు ఏక్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాచమల్లు ధర్నా చేయడం సిగ్గుచేటు: టీడీపీ

విశాలాంధ్ర-పులివెందుల: ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచ మల్లు ప్రసాద్‌రెడ్డి ధర్నా చేయడం సిగ్గుచేటని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కులుగారి విజయ్ కుమార్ రెడ్డి, పులివెందుల పట్టణ అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డిలు విమర్శించారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రాజెక్టుల సందర్శనలో భాగం గా పులివెందుల ప్రాంతంలో పర్యటించడంతో వైసీపీ నాయకుల్లో వణుకు పడుతోందన్నారు. అవినీతిని ప్రోత్సహించే శివప్రసాద్‌రెడ్డి అధికారపార్టీ లో ఉంటూ ధర్నాలు, నిరసనలకు ఉపక్రమించడం శోచనీ యమన్నారు. ప్రొద్దుటూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి గురించి అక్కడ అధికారిని మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి నిలదీసిన క్రమంలో ఆ కార్యాలయం ఎమ్మెల్యే జాగీర అని ప్రశ్నించా దని, ఇందుకు ప్రొద్దుటూరు శాసనసభ్యుడు రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి తన అనుచరులతో కార్యాలయం వద్ద రోడ్డు బ్లాక్ చేసి ధర్నా చేపట్టారు అన్నారు. ఎమ్మెల్యేకు పోలీసులు వంత పాడడం ఆశ్చర్యకరమన్నారు. దీన్ని బట్టి చూస్తే జిల్లాలో వైకాపా ఎమ్మెల్యేలకు ఓటమి భయం పట్టుకుందని అర్థమవుతుందన్నారు. ఎమ్మెల్యేలకు దిక్కు తోచక చంద్రబాబు పైన, నారా లోకేష్ పైన లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆరోపిం చారు. రాష్ట్ర ప్రజలు వైకాపా పార్టీని ఇంటికి సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 2024 లో జరిగే అసెంబ్లీ ఎన్నికలలో రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీ 120 స్థానాలను కైవసం చేసుకుంటుందని చెప్పారు.

బస్సు సర్వీసులు పునరుద్ధరించండి

విశాలాంధ్ర-గాలివీడు: మండలంలోని పలు గ్రామాలను అనుసంధానం చేస్తూ పట్టణాలకు నడిపే బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గొట్లమిట్ల శ్రీనువాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ను కలసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నడిపి ఆ తర్వాత రద్దు చేసిన మదనపల్లె-జమ్మలమడుగు వయా గాలివీడు సర్వీసు, వేంపల్లి-ప్రొద్దుటూరు, జమ్మలమడుగు ఆర్టీసి ఎక్స్ ప్రెస్ సర్వీస్ ను, అలాగే కడప-హిందూపూర్ వయా రాయచోటి, కదిరి మీదుగా ఉన్న పాత సర్వీసుల్ని పునరుద్ధరించాలన్నారు. అలాగే పెరుగుతున్న ప్రజా రవాణా మరియు వ్యాపార అవసరాల దృష్ట్యా రాయచోటి-పుట్టపర్తి వయా గాలివీడు, కదిరి, నల్లమాడ క్రొత్త సర్వీసులను ప్రజల,వాణిజ్య వ్యాపార సముదాయ రవాణాను దృష్టిలో ఉంచుకుని తిరిగి ప్రారంభించాల్సిందిగా వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు.

బీసీల వ్యతిరేకి వైసీపీ ప్రభుత్వం: టీడీపీ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలికి మరో సారి రెడ్డి సామాజికవర్గానికి కేటాయించి ముఖ్యమంత్రి జగన్ రెడ్డి బీసీ వ్యతిరేకిగా నిరూపించుకున్నారని, మొన్నటి వరకు పెద్ద బాబాయ్ సుబ్బారెడ్డి, ఇప్పుడు చిన్న బాబాయ్ కరుణాకర్ రెడ్డికి స్థానం కల్పించి తన 5 సంవత్సరాల పాలనలో తన బంధు వర్గానితో టీటీడీ చైర్మన్ పదవిని భర్తీ చేశారని బీసీ నేత, బెస్త సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ యాటగిరి రాంప్రసాద్ స్పష్టం చేశారు. టీటీడీ చైర్మన్ గా కరుణాకర్ రెడ్డిని నియమించడాన్ని వ్యతిరేకిస్తూ టీడీపీ బీసీ నేతల ఆధ్వర్యంలో శుక్రవారం కడప నగర పాత బస్టాండ్ కూడలిలో ఉన్న పూలే విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాటగిరి రాంప్రసాద్ మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బీసీకి చెందిన కాగిత వెంకట్రావు (గౌడ), సుధాకర్ యాదవ్(యాదవ్), కృష్ణమూర్తి (బలిజ) లను టీటీడీ చైర్మన్ గా నియమించి బీసీల గౌరవాన్ని పెంచిందన్నారు. అదే వైసీపీ ప్రభుత్వం రెండుసార్లు ముఖ్యమంత్రి చిన్నాన్న సుబ్బారెడ్డికి, మూడో సారి చిన్నాన్న వరుస అయ్యే కరుణాకర్ రెడ్డికి కట్టబెట్టి బీసీ వ్యతిరేకతను చాటుకున్నా రన్నారు. వాస్తవాలు గమనించిన బీసీలు రానున్న ఎన్నికల్లో వైసీపీని భూస్థాపితం చేయనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు భరత్, వెంకటసుబ్బయ్య, సుధాకర్ యాదవ్,ఆవుల వెంకటేష్, ద్వారక, పోలి సాయి, గడ్డం శ్రీను తదతరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలోనే రాష్ట్రంలో మహిళలకు భరోసా

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగరంలోని 27వ డివిజన్ నందు సున్నపురాళ మిట్ట గరీభ్ షా వీధులలో టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి వి.ఎస్ అమీర్ బాబు గారి ఆదేశాల మేరకు మహిళలకు భవిష్యత్తుకు గ్యారెంటీ మహాశక్తి అనే పథకాలతో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసిన అనంతరం తెలుగుదేశం పార్టీ నగర ప్రధాన కార్యదర్శి జల తోటి జయ కుమార్ మాట్లాడుతూ రాబోయే రోజులలో తెలుగుదేశం పార్టీని మహిళలు ప్రజలు భ్రమరాథం పట్టి తప్పకుండా గెలిపిస్తారని ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మహాశక్తిలో భాగంగా మహిళలకు భరోసా కల్పిస్తూ ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లను, అలాగే తల్లికి వందనం పేరుతో ఎంతమంది కుటుంబంలో చదువుతున్న చిన్నారులకు ఏడాదికి 15000 రూపాయలు మరియు 18 సంవత్సరములు నిండిన ప్రతి మహిళకు ప్రతినెల 1500 రూపాయలను తమ ఖాతాలలో జమ చేయడం జరుగుతుందన్నారు. నారా చంద్రబాబు నాయకత్వాన్ని బలపరిచి సైకిల్ గుర్తుకే ఓట్లు వేసి ఆదరించాలని జలతోటి జయకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ జలతోటి అనిత, నగర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి వరద పార్వతి, కిరణ్ కుమార్ యాదవ్, నగర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు పేయ్యల ప్రణవతి జలతోటి సాత్విక (స్వీటీ) పంబల నాగలక్ష్మి, ప్రమీలమ్మ జలతోటి స్వర్ణలత రాణి, లతక్క విజయ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల జీవన ప్రమాణాలను పెంచిన సిఎం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా)ల జీవన ప్రమాణాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పెంచారని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం పెనగలూరు మండల కేంద్రంలో వెలుగు అద్వర్యంలో జరిగిన వైయస్సార్ సున్నా వడ్డీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లించిన మహిళా సంఘాలలోని పేదింటి అక్క చెల్లెమ్మల మీద వడ్డీ భారం పడకుండా వారి తరపున ఆ వడ్డీ భారాన్ని ముఖ్యమంత్రి చిరునవ్వుతో స్వీకరించి వైయస్సార్ సున్నా వడ్డీ కింద నేరుగా పొదుపు సంఘాల బ్యాంకు ఖాతాలో రీయింబర్స్మెంట్ చేసిన ఘనత జగనన్న కే దక్కిందన్నారు. మండలంలో 4450 సంఘాలకు రూ-6 కోట్ల 47 లక్షల మెగా చెక్ ఎమ్మెల్యే అందజేశారు. వరుసగా నాలుగో ఏడాది వైయస్సార్ సున్నా వడ్డీ కింద నేరుగా పొదుపు సంఘాల బ్యాంకు ఖాతాలో జమ చేశామన్నారు. ఏసి నిరంజన్ ఎమ్మెల్యేకి శాలువాకప్పి ఘనంగా సన్మానించా రు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి వైస్ ఎంపిపి కొండూరు విజయ్ రెడ్డి, జడ్పిటిసి సుబ్బరాయుడు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శ్రీనివాసులు రెడ్డి, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ ఈశ్వరయ్య, తహశీల్దార్ శ్రీధర్ రావు, ఎంపిడిఓ వరప్రసాద్, వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ నిరంజన్, స్త్రీ నిధి ఏరియా కో ఆర్డినేటర్ మల్లికార్జున రాజు, ఎపిఎం లు రవికుమార్, ఆర్ముగం, రామచంద్రయ్య, వివోఓలు పాల్గొన్నారు.

ఎర్రంపల్లె ఎస్సీ కాలనీకి డ్రైనేజి కాలువలు ఏర్పాటుచేయాలి

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల పరిధిలోని పలుగురోళ్లపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న ఎర్రంపల్లె ఎస్సీ కాలనీలో డ్రైనేజి కాలువలు ఉన్న కాలువలు బూడిపోవడంతో మురికినీరంత రోడ్లపైకి రావడంతో వృద్ధులు, చిన్నారులు బయటికి రావాలంటే భయాందోళనకు గురౌతున్నా రని, గతంలో కొంతమంది జారిపడ్డారని, ఈ డ్రైనేజి కాలువలు ఏర్పాటుచేయాలని, శిధిలావస్థలో ఉన్న విద్యుత్ పోల్లను కూడ తొలగించి కొత్తలైన్ ఏర్పాటుచేయా లని, ఓ ఇంటి వాకిట్లో విద్యుత్ పోల్లు అడ్డంగా ఉండటంతో తొలగించాలని అధికారులకు స్పందనలో ఫిర్యాదుచేసిన పట్టించుకోలేదని గ్రామస్థులు తెలిపారు. ఇటివల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పంచాయతీలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చేపట్టడంతో ఎర్రంపల్లె ఎస్సీ కాలనీలో పర్యటించడంతో ఆయన దృష్టికి తీసుకువెల్లడం జరిగిందని గ్రామ వైకాపా నాయకుడు మూరతోటి ఆలిబర్ సమస్యను అధికారుల దృష్టికి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెల్లారని అధికారులు హామీ ఇవ్వడం జరిగిందని, పనులు వేగవంతం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఏనుగు మృతి కేసులో ముద్దాయి అరెస్టు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : బాలపల్లి అటవీశాఖ పరిధి లో విపిఆర్ ఖండ్రిక గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మిగార్డెన్ ఎస్టీ కాలనీ సమీపంలో చీకటి నరసమ్మ కు చెందిన మామిడి తోటలో అక్రమంగా విద్యుత్ తీగలు లాగి పెద్ద ఏనుగు ను బలీతీసుకున్న ముగ్గురు ముద్దాయిలను గుర్తించామని బాలపల్లి ఎఫ్ఆర్ఓ ప్రభాకర్ రెడ్డి శుక్రవారం పాత్రికేయులకు తెలిపారు. ఓబులవారి పల్లి మండలంలోని ముక్కావారిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన కుప్పచర్ల ఈశ్వరయ్య అనే ముద్దాయిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి అల్యూమినియం వయరు,కర్రలను స్వాధీనం చేసుకుని వన్యప్రాణి చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు. మిగిలిన ఇద్దరు కుప్పచర్ల మల్లికార్జున, ప్రసాద్ పరారీలో ఉన్నారు, వారికోసం ప్రత్యేకంగా గాలింపు చర్యలు వేగవంతం చేశామన్నారు. త్వరలో పట్టుకుని కఠినంగా శిక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ చంద్రకళ,ఎఫ్ఎస్ఓ బాలచంద్రుడు,ఎబిఓ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో నిరసన

విశాలాంధ్ర-యర్రగుంట్ల : గత కొన్ని రోజులుగా విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళన బాట పట్టిన విషయం విదితమే. తుదకు ఈ నెల 10వ తేదీ నుండి సమ్మెలోకి కూడా వెళ్లాలని వారు నిర్ణయించుకోవడం రాష్ట్ర ప్రభుత్వం వీరితో చర్చలు జరిపి సమ్మె నోటీసు ఉపసంహరించుకునేలా చేసిన సంగతి కూడా విదితమే. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇక్కడి ఆర్టీపీపీలో ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు, కార్మికులకు సరైన న్యాయం దక్కకపోయినప్పటికీ సమ్మె నోటీసును ఉపసంహరించుకోవడం పట్ల ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రధాన ద్వారం వద్ద మధ్యాహ్నం భోజన విరామ సమయంలో యాజమాన్యం, ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలిచ్చారు. ఈ నెల 9వ తేదీన చేసుకున్న ఒప్పందాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని వారు తేల్చిచెప్పారు. తమ న్యాయ సమ్మతమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు, కార్మికులు కుదిరిన ఒప్పందంపై అవగాహన పెంచుకొని జరిగిన నష్టాన్ని గ్రహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటరంగనాయుడు, నూర్‌బాషు, సుబ్బిరెడ్డి, గంగయ్య, నాగేంద్ర, పుల్లారెడ్డి, సాంబశివారెడ్డి, గిరిబాబు, చిన్నారెడ్డి, నరసింహులు, పుల్లారెడ్డి, రాము పాల్గొన్నారు.

ఘనంగా అమృత్ మహోత్సవాలు

విశాలాంధ్ర-పీలేరు: అజాదీ కా అమృత్ మహోత్సవం పీలేరు మండలంలో ఎంపీడీవో మురళీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వతంత్రం వచ్చి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆజాదీ క అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పీలేరు మండల పరిధిలోని గూడారేవుపల్లి, పీలేరు కోటపల్లి జిల్లా పరిషత్ బాలుర హై స్కూల్‌లో నా భూమి నా దేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీలేరు మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథ్ రెడ్డి పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధులను, దేశ సైనికులను గౌరవించడం మన ప్రధాన బాధ్యత అని వారు దేశానికి చేసే సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా శిలా ఫలకం ఆవిష్కరణ, ప్రతిజ్ఞ, వసుధ కి వందనం ద్వారా 75 మొక్కలు నాటడం జరిగినది మరియు వీరులకు వందనం సమర్పిస్తూ రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్ అయిన ద్వారక నాథ్ రెడ్డి కి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దండు జగన్ మోహన్ రెడ్డి, గ్రామ కన్వీనర్, వార్డ్ మెంబెర్స్, ఏపీవో మహేష్ ,పంచాయతీ కార్యదర్శి మైసర్, సచివాలయం సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్, వాలంటీర్స్ అందరూ పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధమా
వైసిపి నేతలకు టీడీపీ యువ నాయకులు మేడా బాబు సవాల్

విశాలాంధ్ర -రాజంపేట: నియోజకవర్గ కేంద్రంలోని సుండుపల్లి మండలంలో జరిగిన భూ అక్రమాలలో తన ప్రమేయం ఉందని నిరూపిస్తే రాజకీయాల నుండి తప్పుకుంటానని యువ నాయకులు మేడా విజయ శేఖర్ రెడ్డి (పెదబాబు) వైసిపి నేతలకు సవాల్ విసిరి బహిరంగ చర్చకు సిద్ధమని పిలుపునిచ్చారు. శుక్రవారం బోయినపల్లి ఏపీ టూరిజం హరిత రెస్టారెంట్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో తనకు ఉన్నటువంటి ప్రజాదరణ ఓర్వలేక వైసీపీ నాయకులు తనపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. సుండుపల్లి మండలంలో దళిత మహిళ అయినటువంటి లక్ష్మీదేవి భూమిని తాను అక్రమించుకోవడం జరిగిందని వైసిపి నాయకులు లేనిపోని ఆరోపణలు చెయ్యడం జరుగుతుందన్నారు. అయితే దళిత మహిళ అయినటువంటి లక్ష్మీదేవికి ఆ భూమిపై ఎటువంటి ఆధారాలు లేవన్నారు. ఒక్క ఆధారం చూపించినా రాజకీయ సన్యాసం చేస్తాన న్నారు. వైసీపీ నాయకులకు ఆ దళిత మహిళలకు న్యాయం చేయాలనుకుంటే అసైన్మెంట్ కమిటీలో ఆ మహిళ పేరును ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి రెండేళ్లు అవుతున్న బాధితులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు సర్వం కోల్పోయిన బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో హరీష్, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటాం

విశాలాంధ్ర - రాజంపేట: పట్టణ కేంద్రంలో ఉన్నటువంటి కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు ప్రభుత్వం నిబంధన అతిక్ర మిస్తూ ఇష్టానుసారంగా ప్రభుత్వ సెలవు దినాల్లో తరగతుల నిర్వహిస్తూ విద్యార్థులకు ఆట పాట లేకుండా మానసికంగా చదువు చదువు అని ఒత్తిడి చేస్తూ విద్యార్థులను మానసికంగా విద్యార్థులను వేదనకు గురి చేస్తున్నారు. అలాంటి పాఠశాల లపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ లు రఘురామరాజు, సుబ్బరాయుడు కు శుక్రవారం ఎస్ఎఫ్ఐ రాజంపేట పట్టణం కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనలు ప్రకారం తరగతులు నిర్వహించని కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని,లేని పక్షంలో ఎస్ఎఫ్ఐగా అడ్డుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు గౌరీ శంకర్ కార్యదర్శి ఉపేంద్ర , కమిటీ సభ్యులు గోవర్ధన్, మురళి,చెంగయ్య, నవీన్,కార్తీక్, పవన్ పాల్గొన్నారు.

కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా 30 పడకల వైద్యశాల ఏర్పాటు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కడప : సిద్ధవటం మండల కేంద్రమైన సిద్ధవటం గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ 30 పడకల వైద్యశాల ప్రార ంబోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమంలో వైద్య శాల శిలఫలకాన్ని రాజంపేట శాసనసభ్యులు శ్రీ మేడా వెంకట మల్లికార్జున్ రెడ్డి ఆవిష్కరించారు.అలాగే జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి వారి చేతుల మీదుగా వైద్యశాలను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్రలో చెప్పినట్లుగా సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న ఘనత మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో వైద్యశాలకు వెళ్లాలంటే పట్టణ ప్రాంతాలకు వెళ్లే వారని రోడ్లు సరిగ్గా లేక , బస్సులు సరైన సమయాలకు రాక ఇబ్బందులు పడేవారన్నారు. గతంలో సిద్ధవటంలో ఉన్న వైద్యశాలలో సక్రమంగా సౌక ర్యాలు ఉండేదికాదని ఈనాడు ఉద్యానవనంలో మంచి వైద్య శాల ఏర్పాటు అయిందని మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి శ్రీకాంత్ రెడ్డి,సింగిల్ విండో డైరెక్టర్ జగదీశ్వర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు నారపు రెడ్డి శ్రీనివాసులు రెడ్డి,మార్కెట్ యార్డ్ చైర్మన్ దీపం లక్ష్మీ దేవి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు జవహర్ భాష, ఏకుల రాజేశ్వరి రెడ్డి,ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఆలం గోపాల స్వామి, మల్లు వెంకట వెంకట సుబ్బా రెడ్డి, సయ్యద్ నూర్, ఉప సర్పంచ్ ప్రతినిధి నాగం నరసింహారెడ్డి,జెసిఎస్ కన్వీనర్ రాజ శేఖర్ రెడ్డి, కృష్ణ చైతన్య, రావుల సుబ్బారెడ్డి, కుప్పం వెంకటసుబ్బారెడ్డి, నాయబ్ రసూల్, సర్పంచులు, మాజీ సర్పంచు లు, ఎంపీటిసీలు, మాజీ ఎంపీటి సీలు, డిసీహెచ్ఓ హిమదేవి, మధుశేఖర్, పాల్గొన్నారు.

గంగిశెట్టి మరణం సీపీఐకి తీరని లోటు
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: రాయచోటి సిపిఐ సీనియర్ నాయకులు మాజీ ప్రధానోపాధ్యాయులు దాసరి గంగిశెట్టి శుక్రవారం ఉదయం మరణించడం ఆయన పార్థివ దేహానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య సిపిఐ జెండా కప్పి నివాళులర్పించారు. సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ భావజాలానికి ఆకర్షితుడై అనేక నిర్బంధాలను ఆటుపోట్లు ఎదుర్కొని పార్టీ నిర్మాణం కోసం డాక్టర్ పిచ్చి రాజు సహచరుడిగా రాయచోటి నియోజకవర్గంలో పార్టీ నిర్మాణం కోసం మరియు ఉపాధ్యాయ సమస్యల పోరాట ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటూ పేద బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని. పూటకో సంగం రోజుకో పార్టీ మారే ఈ దశలో గత 55 సంవత్సరాలుగా భారత కమ్యూనిస్టు పార్టీ సభ్యుడుగా నాయకుడిగా ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా తన చివరి శ్వాస వరకు తను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడిన మహోన్నతమైన వ్యక్తి అని ఆయన మరణం పార్టీకి పౌర సమాజానికి తీరనిలోటని కొని ఆడారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి మహేష్, సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాల్ల శ్రీనివాసులు జిల్లా కార్యవర్గ సభ్యులు సుమిత్ర ,విశ్వనాథ నాయక్ కోటేశ్వరరావు జిల్లా సమితి సభ్యులు జక్కుల వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ డి.పి.ఈ.డీ, బీపీఈడీ పరీక్షల ఫలితాలు విడుదల

విశాలాంధ్ర-కడప వైవీయూ : జులైలో జరిగిన డి.పి.ఈ.డీ, బీపీఈడీ తృతీయ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకుపతి ఆచార్య చింతా సుధాకర్, కులసచివులు ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వర రెడ్డితో కలసి విడుదల చేశారు. అనంతరం ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ డి.పి.ఈ.డీ మూడో సెమిస్టర్ పరీక్షలో వందశాతం ఫలితాలు వచ్చాయని, అలానే బీపీఈడీ తృతీయ సెమిస్టర్ పరీక్షల్లో 84.87 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల సహాయ అధికారులు డా.ఆదినారాయణ రెడ్డి, డా.సుమిత్ర పాల్గొన్నారు.

శ్రీనివాసరెడ్డిపై తప్పుడు కేసులు పెట్టిన పోలీసులను వదిలిపెట్టం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : వైకాపా నేతకు లొంగి అక్రమ కేసులు పెట్టిన పోలీసులను వదలమని అంగళ్లు ఘటనలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పై పోలీసులు కేసు నమోదు చేయడం పట్ల ఆయన భార్య రెడ్డప్ప గారి మాధవి పై విధంగా హెచ్చరించారు. శ్రీనివాసరెడ్డి నివాసం లో టిడిపి నాయకులు ప్రవీణ్ , గోవర్ధన్లతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కడప పార్లమెంటుకు శ్రీనివాస రెడ్డి పోటీ చేస్తున్నారనే, వైకాపా ఎంపీ అవినాష్‌ను భయం వెంటాడుతుందన్నారు. అధికారం ఉందని, వ్యవస్థలను చేతుల్లోకి తీసుకొని, ఇష్టం వచ్చినట్లు, తిరిగి అధికారం కోసం కేసులు పెట్టితే న్యాయస్థానాల్లో దోషులుగా నిలబడతారన్నది గ్రహించా లని, వైకాపా నేతలకు ఆమె సూచిం చారు. పుంగనూరు అంగళ్ళ వద్ద జరిగిన రాళ్ల దాడి సంఘటనలో తన భర్త శ్రీనివాస రెడ్డి లేరని, లేని వ్యక్తిని ఆ కేసులో ఎలా ఇరికిస్తారని, సాక్ష్య దారాలతో న్యాయస్థానంలో లేరన్నది నిరూపించి, కేసు నమోదు చేసిన పోలీసులకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. జిల్లాలో టిడిపి నాయకులు, కార్యకర్తలపై ఎన్ని కేసులు పెట్టినా భయపడరని, వారికి అండగా నిలబడి, కేసులు పెట్టిన వారికి న్యాయపరంగా బుద్ధి చెబుతామన్నారు. అక్రమ కేసులు నమోదు చేసిన పోలీసులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆమె తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

'ప్రాణదాత' ట్రాఫిక్ ఏ.ఎస్.ఐ సుబ్బన్న సేవలు అభినందనీయం

విశాలాంధ్ర -కడప : ప్రొద్దుటూరు పట్టణంలో ప్రమాదంలో ఉన్న ఓ వృద్ధుడిని సమయస్ఫూర్తితో వేగంగా స్పందించి ప్రాణదాతగా నిలిచిన ట్రాఫిక్ ఏ.ఎస్.ఐ సుబ్బన్నను జిల్లా ఎస్.పి కే.కే.ఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు అదనపు ఎస్.పి (అడ్మిన్) తుషార్ డూడి ఐ.పి.ఎస్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం అదనపు ఎస్.పి ఏ.ఎస్.ఐ సుబ్బన్నకు నగదు రివార్డు, ప్రశంసా పత్రం అందచేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్.పి మాట్లాడుతూ ఏ.ఎస్.ఐ సుబ్బన్న ప్రమాదంలో ఉన్న ఓ వ్యక్తిని కాపాడి పోలీస్ శాఖ ఔన్నత్యాన్ని మరింతగా పెంపొందించి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. ముమ్ముందు ఇదే స్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని ఆకాంక్షించారు.

5,10 వార్డులు ఏకగ్రీవం

విశాలాంధ్ర-గాలివీడు: మండలకేంద్రం గాలివీడు పట్టణంలోని 5,10 వార్డులకు పొలినేని మాతమ్మ, తంగాల వెంకటరత్నం లు ఏక గ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనువాసులు తెలిపారు. కేవలం రెండు వార్డులకు గాను ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో పోటీ లేని కారణంగా ఆ ఇద్దరు అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి స్పష్టం చేశారు.

కువైట్‌లో ఒంటిమిట్ట వాసి మృతి



విశాలాంధ్ర-కడప : ఒంటిమిట్ట మండల కేంద్రమైన ఒంటిమిట్ట లోని మాడవీధికి చెందిన సూరే శివప్రసాద్ (37) కువైట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు వారు బంధువులు తెలిపారు. వివరాల లోకెళితే..సూరే శివప్రసాద్ గత పదేళ్ల నుంచి కువైట్‌లోనే విధులు నిర్వహిస్తూ ఒంటిమిట్టకు వచ్చిపోతుంటారు. అయితే ఈ మధ్య గత ఇరవై రోజుల క్రితం ఒంటిమిట్టకు వచ్చి తన స్వగృహానికి పెయింట్ వేయించి తన కుమారులకు ఉన్నత విద్యకోసం విజయవాడలోని చైతన్యకాలేజీలో ఒకరిని, రెండో కుమారుడిని కడప కార్పొరేట్ పాఠశాలలో చేర్పించినట్లు తెలిసింది. శివప్రసాద్ భార్య భారతి కూడా కువైట్‌లోనే ఒక ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నట్లు తెలిసింది. అయితే గత గురువారం శివప్రసాద్ కువైట్‌లో తన విధులు నిర్వహించుకొని తన భార్య భారతిని ఇంటికి పిలుచుకువచ్చే నేపథ్యంలో వెనుకవైపు నుంచి కారు వేగంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో శివప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతని మృతితో ఒంటిమిట్ట మాడ వీధి శోకసంద్రంలో ఉంది. శివప్రసాద్ మృతదేహాన్ని సోమవారంలోగా ఇండియాకు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

విశాలాంధ్ర
వైఎస్ఆర్ కడప జిల్లా



పెండింగ్ పనులపై సమీక్షించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు నియోజికవర్గంలో పెండింగ్ పనులపై ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. శుక్రవారం మున్సిపల్ సమావేశ భవణంలో జరిగిన సమీక్ష సమావేశంలో అన్ని శాఖల అధికారులు మరియు సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, వైసీపీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రొద్దుటూరు నియోజికవర్గంలో చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏఏ గ్రామాలలో ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మెన్ భీమునిపల్లె లక్ష్మిదేవి, ఎంపీపీ శేఖర్‌యాదవ్, జడ్పీటీసీ శారద, రాజుపాళెం ఉప ఎంపీపీ వెలవలి నారాయణరెడ్డి, జడ్పీటీసీ అంజనాదేవీలతో పాటు ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్‌చైర్మెన్ సీఎస్ ఖాజా, కౌన్సిలర్లు, నియోజికవర్గంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఎర్రగుంట్ల అర్బన్, రూరల్ ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహారెడ్డి తెలిపారు. ఈ సమయంలో ఆయా సబ్‌స్టేషన్లలో మరియు 33 కెవి లైన్ నందు మరమ్మత్తు పనులు చేపడతామని ఆయన వివరించారు. విద్యుత్ సరఫరాలో కలుగు అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వర్షపునీరు మళ్లింపు పనులు

విశాలాంధ్ర-యర్రగుంట్ల : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా స్థానిక రైల్వేగేటు సమీపంలో ప్రధాన రహదారిపై నిలిచి ఉన్న నీటిని పక్కకు మళ్లించే పనులను మున్సిపల్ యంత్రాంగం చేపట్టింది. కొనసాగుతున్న పనులను కౌన్సిలర్ మహ్మద్‌ఆలీ, రెండవ వార్డు అధికార వైసీపీ ఇన్‌చార్జి వర్రా డేవిడ్ సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షించారు. ఇక్కడి మట్టిని జేసీబీ సాయంతో తొలగించి దిగువకు నీటిని మళ్లించారు. ఇక్కడ మోకాటిలోతు మేర వర్షపునీరు నిలిచిఉంది. ఫలితంగా పాదాచారులు, ద్విచక్రవాహనదారుల కు తీవ్ర అసౌకర్యం ఉన్న నేపథ్యంలో వర్షపునీటి మళ్లింపు పనులు చేపట్టడం జరిగింది.

ఆర్ట్స్ కళాశాలలో రెండో విడత డిగ్రీ అడ్మిషన్ల ప్రారంభం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వారు నిర్వహిస్తున్న డిగ్రీ అడ్మిషన్లలో భాగంగా 2023-24 విద్యా సంవత్సరానికి గాను నాలుగు సంవత్సరాల ఆనర్స్ డిగ్రీ కోసం ప్రవేశాల నిమిత్తం కళాశాల యందు సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.జి.రవీంద్రనాథ్ అన్నారు. మొదటి విడతగా అడ్మిషన్లు పొందని విద్యార్థులు, అంత కాకుండా మొదటి విడతలో అడ్మిషన్లు పొంది గ్రూపును మార్పు చేయదలుచుకున్న విద్యార్థులు కళాశాలలో సంప్రదించి తమ ఐచ్ఛికాలను నమోదు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ అన్నారు. అంతే కాకుండా కళాశాలలో మహిళలకు కూడా ప్రవేశం కలదని తెలియజేశారు.

మొక్కలు నాటిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

విశాలాంధ్ర-కడప వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం సీతాకోక చిలుకల పార్కు పరిసరాలలోని సైకప్ శేషాచలం జాతి మొక్కలను నాటారు.ఎన్ఎస్ఎస్ యూనిట్- 2 ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.ఎస్.పి వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మేరా మట్టి- మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు భవిష్యత్ ఉపయోగ కార్యక్రమాలు నిర్వహించడం హర్షదాయకమని ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డా.ఎన్.వి. రామిరెడ్డి, బొటానికల్ గార్డన్ ఆచార్య ఎ. మధుసూదనరెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ ప్రిన్సిపల్ ఆచార్య రఘునాథరెడ్డి అభినందనలు తెలిపారు.

కస్తూర్బా పాఠశాల సిబ్బందిపై విచారణ

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల పరిధిలోని కస్తూర్బా బాయి పాఠశాలలో ఇటీవల ఓ బాలిక గోడ తగిలి కింద పడి తలకు గాయం కావడంతో పాఠశాలలో పనిచేస్తున్న సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని, వారిని తొలగించడంతో వంట వారు, నైట్ వాచ్‌మేన్, స్వీపర్లు ఐదు మందిని తొలగించడంతో వారిపై జిల్లా కలెక్టర్ నివేదికను పంపించాలని జిల్లా డీసీఓ విజయలక్ష్మి విచారణ అధికారిగా, మైదుకూరు ఎంఈఓ పద్మలతను పాఠశాలలో జరిగిన సంఘటనలపై విచారణ చేపట్టాలని అధికారులు ఉత్తర్వుల మేరకు శుక్రవారం కస్తూర్బాబాయి స్కూల్ నందు జరిగిన సంఘటనపై విద్యార్థుల ద్వారా సమాచారాన్ని సేకరించారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజనంపై వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. గతంలో పనిచేసిన, తొలగించబడిన సిబ్బందిపై కూడ విడివిడిగా విచారణ చేపట్టారు. వారి యొక్క నివేదికను జిల్లా అధికారుల కు అందచేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బాబాయి పాఠశాల ఎస్ఓ అనూష, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం ఎస్ఐగా లక్ష్మీనారాయణ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-కడప: సిద్దవటం ఎస్సైగా లక్ష్మీనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సిద్దవటం ఎస్సైగా పని చేస్తున్న తులసి నాగప్రసాద్ కడప ఎస్.బీ కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వీరాపునాయుని పల్లి ఎస్సైగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణను సిద్దవటం పోలీస్ స్టేషన్ కు ఆటాచ్ చేస్తూ ఆదేశాలు జారీ చెయ్యడంతో ఆయన సిద్దవటం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు.

కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి: తులసిరెడ్డి

విశాలాంధ్ర - కడప: రాష్ట్రంలో దుష్ట చతుష్టయ పార్టీ లు బిజెపి, టిడిపి, వైకాపా, జన సేనలు కలసి రాష్ట్రాన్ని సర్వ నాశనం చేస్తున్నాయని, కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మాజీ రాజ్యసభ సభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి అన్నారు. శుక్రవారం చెన్నూరులో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కమలాపురం నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశానికి తీరని ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రానికి సంజీవిని లాంటి ప్రత్యేక హొదాకు పంగనామాలు పెట్టిందన్నారు. జిల్లాలోని స్టీల్ ప్లాంట్ కు స్వస్తి పలకడంతో పాటు దుగరాజపట్నం ఓడరేవు ఊసే లేదన్నారు. రాయలసీమ ఉత్తరాంధ్రకు బుందేల్ కండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీకి తిలోదకాలు ఇచ్చిందన్నారు. పోలవరం ప్రాజెక్టు ప్రశ్నార్థకమైందని, విశాఖ రైల్వే జోన్ ప్రస్తావనే లేదని, ఆంధ్ర ఆత్మాభిమానికి ప్రతీక అయినా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ను అమ్మకానికి పెడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్రంలో టిడిపి వైకాపా జనసేనలకు ఓటేస్తే అది బిజెపికి వేసినట్లేనని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నట్లయితే ఆరు లక్షల రూపాయల వరకు వ్యవసాయ రుణాలు మాఫీ, 500 రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తామన్నారు. అనంతరం కమలా పురం నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ విష్ణు ప్రీతం రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా సంస్థాగతంగా బలోపేతం చేయడం జరిగిందన్నారు. సమావేశంలో సమన్వయ కమిటీ సభ్యులు పొట్టి పొట్టి చంద్రశేఖర్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, వెంకటరెడ్డి, షేక్ గౌసియా, నాగరాజు రెడ్డి, చార్లెస్, సందాని బాషా, ఓబులేసు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు సమష్టి కృషి

విశాలాంధ్ర-పులివెందుల: ప్రస్తుత వాతావరణంలో మార్పులు నెలకొన్న నేపథ్యంలో దోమల బెడద ఎక్కువగా ఉందని, వీటి నియంత్రణకు సమష్టిగా కృషి చేద్దామని మున్సిపల్ కమిషనరు నరసింహారెడ్డి తెలిపారు. కడప రోడ్డు నందు డ్రై డే -ఫ్రై డే సందర్భముగా టైర్ల దుకాణాలను తనికి చేసి టైర్ల నందు ఉన్న నీటి నిల్వలను పారిశుద్ధ్య సిబ్బంది తో తొలగించి దోమల నివారణ చర్యలను చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలకు తెలియజేశారు. మళ్లీ టైర్ల నందు నీటి నిల్వ ఉంచిన యెడల తగు జరిమానా విధించి టైర్లను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. దోమల ద్వారా సంబవించే మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడువాపు వ్యాధి, బోదకాలు వ్యాధి తదితర వ్యాధులు వస్తాయన్నారు. అనాఫిలిస్: మంచినీటి నిల్వలో పెరిగే అనాఫిలిస్ దోమ మలేరియా వ్యాధిని వ్యాప్తి చేస్తాయన్నారు. ఏడీస్ అను దోమ ఇంటి పరిసరాల్లోని చిన్న చిన్న నీటి నిల్వలలో పెరిగే ఏడీస్ దోమ డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాధిని వ్యాప్తి చేస్తాయని క్యూలెక్స్: మురికి నీటి నిల్వలలో పెరిగే క్యూలెక్స్ దోమ బోద వ్యాధి, మెదడు వాపు వ్యాధిని వ్యాప్తి చేస్తాయన్నారు. దోమల నివారణ, చేపట్టాల్సిన అంశాలు తదితర వాటిని ఆయన వివరించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్ కుమార్ గారు, వార్డు శానిటరీ సెక్రెటరీ లు, హెల్త్ సెక్రెటరీ, సిబ్బంది పాల్గొన్నారు.

మన దేశానికి వందనం

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మనదేశానికి వందనం కార్యక్రమంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి పంచాయతీ పరిధిలోని మనభూమి, మనదేశం స్వతంత్ర్య సమర యోధులకు వందనం అనే కార్యక్రమం ప్రతి పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా దేశానికి వందనం కార్యక్రమం నేమ్ బోర్డులు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఏర్పాట్లుచేయడం జరిగిందని తోట్లపల్లె సర్పంచ్ లక్ష్మీదేవి పేర్కొన్నారు. అందులో భాగంగా జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఈ నేమ్‌బోర్డులను ఏర్పాటు చేయడం జరిగిందని, మండలంలో ఉన్న 11పంచాయతీలలో మనభూమి, మనదేశం కార్యక్రమాన్ని ఏర్పాట్లుచేయడంతో జిల్లా ఉపాధి పీడీ ఆదేశాల మేరకు మండల ఉపాధి అధికారి డా.వసంతకుమార్ ఆధ్వర్యంలో ప్రతి పంచాయతీలో ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. పంచాయతీలోని నేమ్‌బోర్డులతో పాటు చెట్లు నాటే కార్యక్రమం కూడ చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సున్నా వడ్డీ పథకం కాంగ్రేస్ పార్టీది

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి డ్వాక్రా సంఘాల సున్నా వడ్డీ పథకంపై డబ్బా కొట్టుకోవడం హాస్యాస్పదం అని కాంగ్రేస్ పార్టీ నియోజికవర్గ ఇంచార్జ్ నజీర్‌అహ్మద్ పేర్కొన్నారు. కాంగ్రేస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల సున్నా వడ్డీ పథకం 2012లో రూ.5లక్షల వరకు సున్నా వడ్డీ మాఫీ చేసిందని, ఈ పథకం కాంగ్రేస్ పార్టీది అన్నారు. జగన్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ డ్వాక్రా పథకం సున్నావడ్డీ రూ.7లక్షల వరకు అమలు చేయాలని కాంగ్రేస్ పార్టీ డిమాండ్ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ఎస్సీ సెల్ అధ్యక్షులు బి.భాస్కర్ పాల్గొన్నారు.

2024 ఎన్నికల్లో పోటీ చేస్తా : మాజీ ఎమ్మెల్యే వరద

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరులో పెట్రోగిపోతున్న అవినీతి అంతం పలికేందుకే 2024లో జరిగే ఎన్నికలలో తాను పోటీ చేస్తానని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నెహ్రూ రోడ్డులోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ తాను రిజిష్టర్ ఆఫీస్‌కు వెళ్లి చట్ట పరంగా ఉన్న వాటిని రిజిష్టర్ చేయాలని రిజిష్టర్ కార్యాలయ అధికారులను కోరడం జరిగిందన్నారు. సబ్ రిజిస్ట్రార్ తండ్రి వేంపల్లి కొండారెడ్డి 1982 ఎన్నికలలో తనకు ప్రచారం చేశారని, తనకు మంచి స్నేహితుడని తెలిపారు. సబ్ రిజిస్ట్రారుగా తన హయాంలో ఇక్కడ పనిచేస్తూ పక్క ఊర్లకు సైతం తాను రెకమెండ్ చేశానని పేర్కొన్నారు. సబ్ రిజిస్ట్రారుగా ప్రొద్దుటూరుకు వచ్చేందుకు రూ.40లక్షలు తీసుకొని ప్రొద్దుటూరుకు వేయించింది ఎమ్మెల్యే కాదా అని ప్రశ్నించారు. ప్రొద్దుటూరులో ఏ స్థలం అయినా రియల్ ఎస్టేట్ వ్యాపారులు సైతం తమ భూములు రిజిష్టర్ చేయాలంటే ఎమ్మెల్యేకు పబ్బం కట్టాల్సిందేనన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ధర్నా చేసిన ఎమ్మెల్యే జిల్లా అధికారులతో ఒత్తిడి చేస్తూ తనపై కేసు పెట్టమని అధికారులపై ఒత్తిడి తేవడం చూస్తుంటే ఎమ్మెల్యే అవినీతి అధికారులకు అండగా ఉన్నాడని సూటిగా ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న హయాంలో లేదా ఇంతవరకు ఏ ఒక్క సెంటు స్థలం కబ్జా చేసినట్లు నిరూపించాలని ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. ఏదిఏమైనప్పటికి ప్రొద్దుటూరులో అవినీతి అరికట్టేందుకు 2024ఎన్నికలలో పోటీ చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, ఘంటసాల వెంకటేశ్వర్లు, అమీర్‌బాష, వెంకటకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు ప్రక్రియ ప్రారంభం

విశాలాంధ్ర - వల్లూరు : బాలు గారి పల్లె గ్రామం నందు రైతులు వేసిన పంట నమోదు ప్రక్రియ ప్రారంభమైందని కమలాపురం సహాయ కంచాలకులు ఏవి నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలుగారిపల్లె గ్రామం నందు పంట నమోదు ప్రక్రియ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని దాని వల్ల రైతు భరోసా ,కనీసం మద్దతు ధరకు, అమ్ముకునే అవకాశం ,పంటల బీమా, 0 వడ్డీ పెట్టుబడి రాయితీ వంటి ప్రభుత్వ పథకాలు అన్నిటిని ఈ పంట నమోదు మూలం అని వివరించారు. మండల వ్యవసాయ అధికారిని సాయి జ్యోతి మాట్లాడుతూ పంట నమోదుతో పాటు ఈ కేవైసీ కూడా ఇవ్వడం జరుగుతుందని కావున రైతు సోదరులు కూడా ఎందుకు సహకరించి భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మౌనిక, వ్యవసాయ సహాయకులు సురేఖ, రైతులు పాల్గొన్నారు.

సంతకం కోసం వృద్ధురాలి పడిగాపులు

విశాలాంధ్ర-పులివెందుల: సంతకం కోసం ఓ వృద్ధురాలు పడిగాపులుగాసిన ఉదం తం శుక్రవారం పులివెందుల పట్టణంలో చోటు చేసుకుంది. తనకు చిట్టిలో ఇంటిప్లాట్ తగిలినట్లు సంతకం చేయాలంటూ ఆమె విశ్వనాథరెడ్డి ఇంటి ఎదుట నిరసన వ్యక్తంచేసింది. ఈ సందర్భంగా మునెమ్మ మాట్లాడుతూ వీరపునాయుని పల్లెకు చెందిన వద్దిరెడ్డి మునెమ్మ అను నేను సుమారు 15ఏళ్ల క్రితం పులివెందు లకు చెందిన పెద్దకుడాల సుబ్బారెడ్డి అలియాస్ బస్సు సుబ్బారెడ్డి, గూడూరు రామచంద్రారెడ్డి, గూడూరు విశ్వనాథరెడ్డి, విశ్వనాథరెడ్డిలు భాగస్వాములుగా ఉంటూ చీట్ల వ్యాపారం చేశారన్నారు. ఈ చిట్టిలో తనను కూడా సభ్యురాలిగా చేసుకున్నారన్నారు. అయితే చిట్టి ప్రారంభించిన మూడు నెలలకే తనకు ప్లాట్ తగిలిందన్నారు. తనకు తగిలిన 5సెంట్ల ఇంటి స్థలాన్ని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉందన్నారు. కానీ ఇంత వరకు తనకు తన ఇంటిస్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించలేదన్నారు. కాగా తనకు ప్లాట్ తగిలినట్లు ఒప్పందపు పత్రం ఇవ్వాలని అందులో నలుగురు వ్యాపారులు సంతాలు చేయాల్సి ఉందన్నారు. ఇందులో గూడూరు రామచంద్రారెడ్డి, గూడూరు విశ్వనాథరెడ్డిలు సంతకాలు చేశారని, ఈ క్రమంలో విశ్వనాథరెడ్డిని కూడా ఒప్పందం పత్రంపై సంతకం చేయమని కోరగా ఆయన తిరస్కరించారన్నారు. విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ వద్దిరెడ్డి మునెమ్మకు 5సెంట్ల స్థలం చిట్టిలో తగిలిన మాట వాస్తవమేనన్నారు. అయితే నలుగురితో పాటు తాను కూడా మునెమ్మకు ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించేందుకు సిద్దంగా ఉన్నానని విశ్వనాథరెడ్డి వెల్లడించారు.

గుండె పోటుతో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : కడప జిల్లా కాసినయన మండ లంలోని సావిశెట్టిపల్లె గ్రామ నివాసి పెద్దుల్లపల్లె గంగయ్య అనే వ్యక్తి శుక్రవారం గుండె పోటుతో మృతి చెందారు. దీంతో వారి కుటుంబ పెద్ద దిక్కు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు శోక సముద్రంలో మునిగిపోయారు.

ఎమ్మెల్యేను కలిసిన పోస్టల్ సూపరింటెండెంట్

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: హర్ ఘర్ తిరంగా 2.0 సంధర్భంగా ప్రొద్దుటూరు పోస్టల్ సూపరిండెంట్ జి.కిరణ్ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డిని కలిసి జాతీయ జెండాను అందచేశారు. ఎమ్మెల్యే రాచమల్లు పోస్ట్ ఆఫీస్ సేవలను కొనిఆడారు. జాతీయ జెండా రూ.25కే పోస్ట్ ఆఫీస్ నందు లబిస్తుందని, అదేవిధంగ ఆన్‌లైన్‌లో కూడ పొందవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి పౌరుడు వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోస్టర్ అధికారులు టి.దుర్గా ప్రసాద్, ఐపీఓ మధుసూధన్ రెడ్డి, అజీమ్ బాషా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పీఎస్ డేవిడ్ రాజు, చిన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు వైసీపీ భయపడుతోంది: బిటెక్ రవి

విశాలాంధ్ర-వేంపల్లె: వేంపల్లె మండలం ఇడుపుల పాయ పంచాయతీ ఎన్నికలకు వైసీపీ భయపడుతోందని టీడీపీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బిటెక్ రవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ త్వరలో ఇడుపులపాయ పంచాయతీకి సర్పంచు, ఉప సర్పంచు ఎన్నికలు జరుగునున్నాయన్నారు. నోటిఫికేషన్ మొదలు, పోటీ చేసే అభ్యర్థులకు ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఇవ్వాల్సిన ధృవీకరణ పత్రాలు ఇవ్వడం లేదన్నారు. రెండు రోజులుగా పంచాయతీ, మండల అధికారులు టిడిపి అభ్యర్థులు పోటీ చేసేందుకు అవసరమైన ధృవీకరణ, పన్ను లేదని చెప్పే పత్రాలు ఇవ్వడం లేదన్నారు. ఎంపీడీఓ వైఖరి, పంచాయితీ సెక్రటరీలు ఇందుకు విరుద్ధంగా సమాధానం చెబుతున్నారు. ఇడుపులపాయ పంచాయతీలో ఖాళీ పడిన సర్పంచ్, ఉప సర్పంచ్ ఎన్నికలను ఎదుర్కొనే దమ్ము ధైర్యంలేక అధికారులను అడ్డం పెట్టుకొని వైసీపీ కుట్రపూరిత చర్యలకు పాల్పడు తోందని ధ్వజమెత్తారు. సొంత గ్రామంలో ఎన్నికలను ఎదుర్కోలేని వైసిపి అధినేత రాష్ట్రంలో ఎన్నికలను ఎలా ఎదుర్కొంటారని ప్రశ్నించారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా ఎంపీడీవో మల్లికార్జున రెడ్డి అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. టిడిపి అభ్యర్థి నామినేషన్ను డిస్క్ క్వాలిఫై చేయడానికి అధికారులు ఈతాతంగాన్ని నడిపిస్తున్నారని ఆరోపించారు. ఇదుపుల పాయ లో టిడిపి అభ్యర్థికి వచ్చే ఓట్లు రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తెలియజేస్తుందని సీఎం జగన్ భయపడుతున్నారని వెల్లడించారు. ధ్రువీకరణ పత్రాల ఇవ్వకుండా ఏవేవో సాకులు చెప్పిన అధికారుల తీరుపై జెడ్పీ సీఈఓకు ఫిర్యాదు చేయనున్నట్లు బిటెక్ రవి తెలిపారు.

అగ్నిప్రమాద దుకాణాన్ని పరిశీలించిన డిప్యూటీసీఎం

విశాలాంధ్ర- కడప కార్పొరేషన్ : కడప నగరంలోని మండి బజార్లో శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్ నిత్యవసర వస్తువుల హెూల్సేల్ దుకాణంలో గురువారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమా దం సంభవించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్య మంత్రి మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి శుక్రవారం సదరు అగ్ని ప్రమాద ప్రాంతానికి చేరుకొని శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్ వారి కుటుంబ సభ్యులతో పరామర్శించి మనో ధైర్యాన్ని భరోసాను కల్పించారు. దుకాణం యజమాని బద్రీనాథ్, ఆయన కుమారుడు వెంకట్‌లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి అగ్ని ప్రమాదం జరిగిన వివరాలను తెలిపి వారికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. దీంతో స్పందించిన ఆయన ప్రమాదస్థలంలోని అన్ని గదులను పరిశీలించి అందుకు సంబంధించిన ఆర్థిక నష్ట వివరాలు రాత పూర్వకంగా తమకు ఇవ్వాలని సహాయ సహకారాలు అందిస్తామ ని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ షేక్ మహమ్మద్ షఫీ, నాయకులు నారపరెడ్డి సుబ్బారెడ్డి, తోట కృష్ణ, బంగారు నాగయ్యయాదవ్, సుభాన్‌భాష, ఫయాజ్, పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, పుల్లయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

సున్నా వడ్డీ పాత పథకమే: తులసిరెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లె: వైసీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సున్నా వడ్డీ పథకం పాత పథకమేనని, ఈ పథకం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసినట్లు పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ వైఖరి చూస్తుంటే పావు కిలో కోడికి ముప్పావు మసాల. ఉన్నట్లుంది అన్నారు. ఈ పథకం కోసం అనేక పేపర్లలో టీవీలలో అడ్వటైజ్మెంట్ ఇచ్చిన తీరు వైయస్సార్ సున్నా వడ్డీ పథకం మహిళలకు..ఇది కొత్త పథకం కాదు. పాతపథకం అన్నారు 2012 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే కాంగ్రెస్ ప్రభుత్వం 5 లక్షల రూపాయల వరకు అమలు చేసిందన్నారు. కానీ జగన్ ప్రభుత్వం 3 లక్షల రూపాయల వరకే అమలు చేస్తోందన్నారు. ఈ పథకానికి కోట్ల రూపాయల ప్రచార ఖర్చు చేశారని ఆరోపించారు. కావున ప్రభుత్వం స్పందించి రూ. లక్షల వరకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ దాదాపు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలు చేశారన్నారు.రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రాగానే అన్ని పునరుద్దరిస్తామని వెల్లడించారు.

ఎస్సీ కార్పొరేషన్ ఎండిని కలిసిన జిల్లా నాయకులు

విశాలాంధ్ర- కడప కార్పొరేషన్ : ఎస్సీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ చిన్న రాముడు ను కడప జిల్లాకు చెందిన మాల ఐక్యవేది క రాష్ట్ర నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ కార్పొరేషన్ ఎండిగా ఎస్ చిన్న రాముడు బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన నేపథ్యంలో తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో మాల ఐక్యవేదిక రాష్ట్ర సలహాదారు శివప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతురాజు కలిసి శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని దళిత రైతులను ఆదుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకుని నాణ్యమైన విత్తనాలు, మందులు ఇవ్వడం అభినందనీ యమన్నారు. ఇదే తరహాలో దళి తులకు వ్యవసాయ భూములు కేటాయించాలని, గతంలో ఇచ్చిన భూము లను రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. దళిత విద్యార్థుల సంక్షేమం కోసం పాలకులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ఇదే నేపథ్యంలో ఉన్నత విద్యకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు పెంచినకాస్మోటిక్ చార్జీలు చెల్లించాలని, మెరుగైన వసతులు కల్పించాలన్నారు చలికాలం రానున్న నేపథ్యంలో నాణ్యమైన దుప్పట్లు విద్యార్థులకు అందించాలని కోరారు. ఎండి ని కలిసిన వారిలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శివనాయక్ తదితరులున్నారు.

నారాయణ స్కూల్‌లో పిల్లలకు ఎలక్షన్లు

విశాలాంధ్ర- కడప కలెక్టరేట్ : శుక్రవారం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో వున్నా నారాయణ స్కూల్ నందు పిల్లలకు ఎలక్షన్లు నిర్వహించడం జరిగింది. ఏజీమ్ శ్రీనివాసులు, ప్రిన్సిపల్ గీతా ఆద్వర్యంలో బ్యాలెట్ పేపర్ రూపంలో బాక్స్ పెట్టి ఎలక్షన్లు నిర్వ హించడం జరిగింది. శ్రీనివాసులు మాట్లడుతూ ఎలక్షన్ పద్ధతిలో క్లాస్ లీడర్స్ ను ఎన్నుకోవడం ఒక్క నారాయణ స్కూల్లలో మాత్రమే జరుగుతుం దన్నారు. చిన్న పిల్లల్లో నాయకత్వ లక్షణాలను పెంచడానికి ఇది ఉపయోగ పడుతుందన్నారు. మరీ ముఖ్యంగా ఈ కార్యక్రమం పిల్లలకు పెరిగేకొద్దీ ఎలక్షన్ అంటే ఏంటో ఏ విధంగా జరుగుతుందో ఒక మంచి అవగాహన వస్తుందని, ఈరోజు పిల్లలే రేపటి నాయకులు అవుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అకాడమిక్ డీన్ దీప్తి, స్కూల్ టీచర్లు, వైస్ ప్రిన్సిపల్స్ పాల్గొనడం జరిగింది.

వైసీపీ అధికార ప్రతినిధిగా సుభాన్

విశాలాంధ్ర-యర్రగుంట్ల : జిల్లా వైసీపీ అధికార ప్రతినిధిగా ఎర్రగుం ట్ల పురపాలికకు చెందిన సుభాన్‌బాషను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు సురేష్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి సదరు నియామక పత్రాన్ని సుభాన్‌భాషకు అందజేశారు. గతంలో ఎర్రగుంట్ల మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులుగా వ్యవహరించిన సుభాన్‌భాష సుదీర్ఘకాలం కాంగ్రెస్ పార్టీలో కొనసాగి మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకులు డాక్టర్ ఎం.వి. మైసూరారెడ్డి ముఖ్య అనుచరుడిగా గుర్తింపుపొంది ఉన్నారు. తదనంతరం మైసూరా సోదరుడి కుమారుడైన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి వెంట రాజకీయ ప్రస్థానం కొనసాగిస్తున్న సుభాన్‌భాషను వైసీపీ అధిష్టానం గుర్తించి ఆయనకు సముచిత స్థానం కల్పించింది. ఈ సందర్భంగా సుభాన్ తనకు పార్టీ పదవి లభించేందుకు కారకులైన ఎమ్మెల్యే డా.సుధీర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షు లు, కడప మేయర్ సురేష్‌బాబుకు ధన్యవాదాలు తెలిపారు. శక్తివంచన లేకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు 2024 ఎన్నికల్లో సుధీర్‌రెడ్డి మరోమారు ఎమ్మెల్యేగా విజయం సాధించేందుకు గట్టిగా ప్రయత్నం చేస్తానని శపథం చేశారు.

విశాలాంధ్ర

అన్నమయ్య జిల్లా

ఇంటింటి సర్వేను బిఎల్వోలు సక్రమంగా నిర్వహించాలి: జేసీ

విశాలాంధ్ర-రామాపురం: బిఎల్వోలు ఓటర్ నమోదు ఇంటింటి సర్వే సక్రమంగా నిర్వహించాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ పర్మన అహ్మద్ అన్నారు. మండలంలోని కుమ్మర పల్లి. సుద్దమల్ల .నీలకంఠ రావు పేట. రాచపల్లి. చి. గ్రామాల్లో శుక్రవారం మా భూమి మా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈయన కుమ్మరపల్లి గ్రామ సచివాలయానని ఆకస్మిక తనిఖీ చేశారు కుమ్మరపల్లి గ్రామంలో జరుగుతున్న ఓటర్ ఇంటింటి సర్వే చేస్తున్న విఎల్ఓ లను పర్యవేక్షించారు. స్థానిక అమరవీరుల పేర్ల గల శిలాఫలకాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం అమర వీరుల సంస్కరనార్ధం మొక్క లు నాటారు. దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన స్థానిక మహనీయులు సాహసవంతులు వీరులను స్మరించు కోవాలి అన్నారు. పుట్టకతో ఈ నెల బంధం పెంచుకున్న మనము దేశభక్తికి స్ఫూర్తిని ప్రతి ఒక్కరిలో నింపాలని ఆయన అన్నారు. బీఎల్ఓ లు ప్రతి ఇంటింటికి తిరిగి ఓటర్స్ పేర్లు తప్పు లేకుండా సరి చేయాలన్నారు. ఓటర్ లిస్ట్ లో చనిపోయి ఉన్నా .ఇతర పెళ్లయి ఇతర పట్టనలకు వెళ్లిన వారిని గుర్తించి వారు ఊర్లో లేక ఉంటే వారి ఓటరు పేరును తొలగించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులకు ఓటరు గా నమోదు చేసుకోవాల న్నారు. ఓటరు కు డోర్ నెంబర్ లేకుంటే కొత్త డోర్ నెంబరు కల్పించి వారికి ఓటు హక్కు కల్పించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మోహన్ రెడ్డి. తాసిల్దార్ అరవింద్ కిషోర్. ఎంపీడీవో హైదర్ వల్లి. ఏపీవో సురేంద్ర నాథ్ రెడ్డి. ఈసీ శ్రీకాంత్ రెడ్డి. ఆర్ఐ రవికుమార్. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కోటి బసిరెడ్డి. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర- రామసముద్రం: మండలంలోని చెంబకూరు గ్రామంలో శనివారం మదనపల్లెకు చెందిన రమా కంటి వైద్యశాల వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరము నిర్వహించనున్నట్లు డాక్టర్ మహేష్ తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంట నుండి సాయంత్రం ఐదు గంటల వరకు వైద్య శిబిరం నిర్వహిస్తామని చుట్టు పక్కల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హార్డ్‌వేర్ షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీప్యారడైజ్ సినిమా థియేటర్ సమీపంలో శుక్రవారం ఉదయం ఎంజి రోడ్డులో మాజీ జెడ్పిటిసి మారెళ్ల రాజేశ్వరి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి శ్రీరాజేశ్వరి ప్లైవుడ్ హార్డ్ వేర్ అండ్ గ్లాస్ షాపును ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, పట్టణ కన్వీనర్ సిహెచ్ రమేష్ బాబు, పంచాయితీ సెక్రటరీ కె రామసుబ్బారెడ్డి, వైసిపి యువ నాయకులు మారెళ్ల చందు, పాత ఇనుప సామానుల షాపు ఓనర్ భావజాన్ తదితరులు పాల్గొని వ్యాపారం బాగా జరిగి అభివృద్ధి చెందాలని ఆశీర్వదించారు.

శాంతి భద్రతలకు సహకరించండి :సీఐ నరసింహులు

విశాలాంధ్ర- గుర్రంకొండ: నేడు సమాజంలో యువకులు పక్కదారి పడుతున్నారని వారికి అరికట్టాల్సిన బాధ్యత తల్లిదండ్రులు పై ఉందని గురువారం రాత్రి సీఐ నరసింహులు మండల పరిషత్ కార్యాలయంలో పల్లెనిద్ర డ్రింక్ డ్రైవ్ పై గుర్రంకొండ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సమాజంలో అనేక మార్పులకు యువతే ముఖ్యమన్నారు ముఖ్యంగా గుర్రంకొండ మండలంలో యువత గంజాయి డ్రగ్స్ వాడుతున్నారని గతంలో ఎస్సై వారిపై ఎఫ్ ఆర్ ఐ నమోదు అవ్వడం తల్లిదండ్రుల అజాగ్రత్త కారణమన్నారు. శాంతి పద్ధతులకు విఘాతం కలగకుండా నాయకులు ప్రజలు సహాయ సహకారాలు పోలీసులకు అందివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దిలీప్ మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల మాజీ సర్పంచ్ జమీర్ అలీ ఖాన్, సింగల్ విండో అధ్యక్షులు నక్క చంద్రశేఖర్, ఎంపీటీసీ కదిరుల్ల, సర్పంచ్ మస్తాన్ రెడ్డి , నాయకులు నాయిని శివశంకర్, ఏ ఎస్ ఐ నరసింహులు, రమణ, చంద్రశేఖర్, ప్రజలు పాల్గొన్నారు.

పోస్టల్ ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకాల పంపిణీ

విశాలాంధ్ర-పీలేరు: కె.వి. పల్లి మండలం సొరకాయల పేట గ్రామం జడ్పీహెచ్ఎస్ పాఠశాల నందు త్రివర్ణ పతాకాలు ను పోస్టల్ ఆధ్వర్యంలో సొరకాయల పేట బిపిఎం సోమశేఖర్ రెడ్డి మరియు కె.వి. పల్లి మండలం సచివాలయాల కన్వీనర్ పోత్తపు సతీష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయ బృందానికి మరియు పాఠశాలలోనీ విద్యార్థులకు ఉచితంగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కె.వి.పల్లి మండల సచివాలయాల కన్వీనర్ పోత్తపు సతీష్ కుమార్ రెడ్డి, సొరకాయల పేట పోస్టల్ బిపిఎం సోమశేఖర్ రెడ్డి, సొరకాయల పేట పాఠశాల అధ్యాపక బృందం, అయ్యప్ప రెడ్డి, కృష్ణ, చరణ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంగిశెట్టికి సుగవాసి ఘన నివాళులు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: సీనియర్ కమ్యూ నిస్టు నాయకు లు, విశ్రాంత ఉపాధ్యాయులు కామ్రేడ్ దాసరి గంగి శెట్టి మరణ వార్త తెలిసి మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు, రాయచోటి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు వెళ్లి భౌతికకాయానికి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. గంగిశెట్టి కుటుంబ సభ్యులను పరామ ర్శించారు.

దివ్యాంగుల క్రీడల్లో సత్తా చాటిన భవిత విద్యార్థులు

విశాలాంధ్ర-గాలివీడు: జిల్లా కేంద్రం రాయచోటి స్థానిక జూనియర్ కళాశాల ప్రాంగణం నందు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నిర్వ హించిన క్రీడలలో గాలివీడు మండలం స్థానిక భవిత సెంటర్లోని ఎస్.ఆంజనేయులు పరుగు పందెంలో, ఈ.ఆనంద్ సాఫ్ట్ బాల్ లో పోటీలలో రెండవ బహుమతి గెలుపొందారు. మండల విద్యాశాఖ అధికారులు శ్రీ పిల్లి నాగరాజు, శ్రీ వేల్పుల శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ బహుమతులు గెలుపొందడంలో సహా య సహకారాలు అందించిన సమ్మిళిత విద్య ఉపాధ్యాయుడు వి. ఖలందర్ ను అభినందిస్తూ మరెందరో ఇలాంటి పిల్లల్ని తీర్చిదిద్దాలని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇటువంటి పోటీలు నిర్వహిం చడం చాలా సంతోషమని వీటి ద్వారా ప్రత్యేక అవసరా లు గల పిల్లల నైపుణ్యాన్ని వెలికి తీసినట్లు అవుతుం దన్నారు.

మహిళల్లో ఆత్మ స్థైర్యాన్ని పెంచడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- జిల్లాలో 28,545 స్వయం సహాయక సంఘాలకు రూ.41.75 కోట్లు విడుదల: కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: స్వయం సహాయక సంఘ మహిళల్లో ఆత్మ స్థైర్యాన్ని, ఆర్థిక భరోసాను నింపేందుకే.. 'వైఎస్ఆర్ సున్నా వడ్డీ ' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డిలు సంయు క్తంగా పేర్కొన్నారు. శుక్రవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఏర్పాటు చేసిన బహిరంగ వేదిక ద్వారా వరుసగా నాలుగో ఏడాది స్వయం సహాయక సంఘాల మహిళలకు "వైఎస్సార్ సున్నా వడ్డీ" పథకం లబ్ధి మొత్తాన్ని.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ విసి హాలు నుండి జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్, ప్రభుత్వ విప్, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాషలు హాజరయ్యారు. ముఖ్యమంత్రి విసి ముగిసిన అనంతరం నాలుగో ఏడాది సంబంధించి "వైఎస్సార్ సున్నా వడ్డీ" పథకం క్రింద జిల్లాలోని 28,545 సంఘాలకు గాను మంజూరయిన రూ.41.75 కోట్ల మొత్తాన్ని లబ్ధిదారులకు మెగా చెక్కు రూపంలో అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీషా పిఎస్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక ప్రగతి కోసం సున్నా వడ్డీ లబ్ధి మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసి, రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా నిలవడం గర్వించదగ్గ విషయం అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తన సుదీర్ఘ పాదయాత్రలో చేసిన హామీలన్నీ నెరవేరుతున్నాయన్నారు. మహిళ బాగుంటేనే ఇల్లు బాగుంటుందని తద్వారా గ్రామం, రాష్ట్రం, సమాజం బాగుంటుందని నమ్మి రాష్ట్ర ముఖ్యమంత్రి ఆలోచన చేసి 90 శాతం పథకాలు మహిళల పేరిట అమలు చేస్తున్నారన్నారు. గ్రూపులో ఉన్న మహిళా సభ్యులు చిన్న చిన్న వ్యాపారం చేస్తూ పెద్ద, పెద్ద వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. బ్యాంకుల నుండి రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన పొదుపు సంఘాల్లోని పేదింటి అక్కచెల్లెమ్మల మీద ఏ మాత్రం వడ్డీ భారం పడకుండా, ప్రభుత్వమే వారి తరపున వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద ఆ భారాన్ని భరిస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం "వైయస్ఆర్ సున్నా వడ్డీ పథకం" ను ప్రవేశపెట్టిందనన్నారు. మహిళల సంక్షేమ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పొదుపు సంఘాలకు మేలు చేయాలని సదుద్దేశంతో చెప్పిన మాట ప్రకారం ఇప్పటికీ మూడు విడతలు రుణమాఫీ చేశారన్నారు. పొదుపు సంఘాలను బలోపేతం చేయాలని ఆర్పిలకు ఎమ్మెల్యే సూచించారు. ఉన్నటువంటి జనాభా నిష్పత్తిలో సంఘాలు తక్కువగా ఉన్నాయిని, మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. తన తండ్రి రెండు అడుగులు వేస్తే... జగనన్న నాలుగు అడుగులు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పిడి సత్యనారాయణ, ఎల్డీఎం వెంకటేశ్వర రెడ్డి, డిఆర్డిఏ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

వారాహి యాత్ర అడ్డుకుంటే రాష్ట్రం అగ్నిగుండమే: జనసేన

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రథసారధి పవన్ కళ్యాణ్ చేపట్టే వారాహి యాత్ర అడ్డుకుంటే రాష్ట్రం అగ్నిగుండమే అని జనసేనపార్టీ నాయకులు పగడాల బ్రదర్స్ వెంకటేష్ చంద్రశేఖర్ హెచ్చరించారు. జనసేనపార్టీ ప్రధాన కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యారెక్టర్ లేని ఆంబోతు అంబటి, గుట్కా కొడాలి, ఉమ్మడి చిత్తూరు జిల్లా మంత్రి అని చెప్పుకోవడానికి సిగ్గుతో తలదించుకునే రోజా తదితరులు నోరు అదుపులో ఉంచుకోవాలన్నారు. మెగాస్టార్ చిరంజీవిని గాని, పవన్ కళ్యాణ్‌ను గాని విమర్శించే అర్హత మీకు లేదని విమర్శించారు. చిరంజీవి మాటలను, పవన్ కళ్యాణ్ మాటలను వైసిపి మాఫియా వక్రీకరించి ప్రజలను రెచ్చగొట్టి గొడవలకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిరంజీవి అభిమానులు, పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో సహనంతో ఉన్నా అనవసరంగా రెచ్చగొట్టే మాటలు మానుకోవాలన్నారు. పదేపదే విమ ర్శలు చేస్తే తాట తీస్తామని హెచ్చరించారు. మాతో పెట్టుకుంటే పతనమే అని హెచ్చరించారు. మీ అరాచకాల వలన రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని విమర్శనాస్త్రాలు సంధించారు.

'నా భూమి- నా దేశం'లో భాగస్వామ్యం కండి

విశాలాంధ్ర-రామాపురం: రాష్ట్రంలో 'నా భూమి నా దేశం' పేర నిర్వహిస్తున్న కార్యక్రమాలలో అందరూ భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి కోరారు. మండలం లోని సుద్దమళ్ళ పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన 'నా భూమి నా దేశం' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిగా పాల్గొన్నారు. తొలుత గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలవేసి సత్కరించారు. స్థానిక అమరవీరుల పేర్లు గల శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల సంస్మరణార్థం మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ సంక్షేమం కోసం ప్రాణత్యా గాలు చేసిన స్థానిక మహనీయులు, సాహసవంతులు, వీరులను స్మరించుకోవాల్సి ఉందన్నారు. పుట్టుకతో ఈ నేలపై బంధం పెంచుకున్న మనం దేశభక్తి స్ఫూర్తిని ప్రతి ఒక్కరిలో నింపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏ పి ఓ సురేంద్ర రెడ్డి,నాగిరెడ్డి, ఆంజనేయులు రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, నాగశేఖర్ రెడ్డి, మహేష్, నాగ సుబ్బారాయుడు,సాధశివ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం నందు శ్రీ భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు చేస్తున్న భక్తులు పూజలో పాల్గొన్న భక్తులందరికి తీర్థప్రసాదాలు అందజేసినట్లు ఆలయ ఛైర్మెన్ పోలంరెడ్డి విజయు, ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.వి.రమణారెడ్డి, పాలకమండలి సభ్యులు తెలియజేశారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

విశాలాంధ్ర-పీలేరు:- ఏపీపిటిడి ఉద్యోగులు మరియు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీలేరు డిపో ఎస్ డబ్ల్యూ ఎఫ్ గౌరవాధ్యక్షులు మాదినేని శంకర్ నాయుడు అన్నారు. పీలేరు డిపో ప్రాంగణంలో శుక్రవారం ఏపీ పీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశం అధ్యక్షులు కేసి ఎస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో గౌరవాధ్య క్షులుగా శంకర్ నాయుడు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వీరు మీడియాతో మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల కండిషన్, ఆర్టీసీ స్థలం ఆక్రమణల గురించి, ఉద్యోగులు సిబ్బంది సమస్యల గురించి డిపో మేనేజర్‌కు మెమొరాండం ఇచ్చి పరిష్కరింప చేయాలని తీర్మానించామని తెలిపారు. ఒప్పంద కార్మికులను, ఒప్పంద డ్రైవర్లను సమస్యల పరిష్కరించాలని తీర్మానించామని తెలిపారు. ఈ సమావేశానికి ఏపీ పీటీడీ ఎస్ డబ్ల్యూ ఎఫ్ జోనల్ కార్యదర్శి సి.భాస్కర్ పీలేరు డిపో కార్యదర్శి హెచ్ఎం.బాబు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రక్రియ పగడ్బందీగా నిర్వహించాలి



విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి: ఓటర్ల జాబితా ప్రక్రియ పగడ్బందీగా నిర్వహించాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ పర్హాన్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు శుక్రవారం లక్కిరెడ్డిపల్లి లోని సచివాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎల్వోలు ఓటర్ల జాబితాను ఆయన పరిశీలించారు .చనిపోయిన వారిని తొలగించి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని బిఎల్ఓ లకు సూచించారు. సచివాలయం సిబ్బంది కూడా సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు .సచివాలయంలో సిబ్బంది ఎప్పటికప్పుడు సమస్యలపై దృష్టి పెట్టి క్యాస్ట్, ఇన్కమ్ ,ఇతర విషయాలు పరిష్కరించాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతూ గర్భవతులు బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలన్నారు .కాన్పులు ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగేటట్టు చూడాలన్నారు .ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఉదయ శంకర్ రాజు ఎంపీడీవో వెంకటరామిరెడ్డి పంచాయతీ సెక్రెటరీ సుదర్శన్ రెడ్డి ఆర్ఐ సమ్మత్ ఖాన్ బిఎల్వోలు సచివాలయ సిబ్బంది ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుపై కేసులు నమోదు సరికాదు

విశాలాంధ్ర-సుండుపల్లి : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు తెలుగుదేశం పార్టీ శ్రేణులపై కేసులు పెట్టడం సిగ్గుచేటు అని రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షుడు భగవాన్ సహాయరెడ్డి తెలిపారు. శుక్రవారం సుండుపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో ఆయన ప్రసంగించారు. అల్లర్లు సృష్టించింది వైకాపా నాయకులను వదిలేసి టిడిపి నాయకులపై కేసులు పెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. అక్రమ కేసులు పెట్టి టీడీపీ కార్యకర్తలను నాయకులను బెదిరించుకోవాలని సీఎం అనుకుంటున్నారని ఆయన విమర్శించారు. మరి నీ కేసులు పెట్టాలని ఏకంగా సీఎం ఆదేశించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కేసులతో భయపడేది లేదని, ఎన్ని కేసులు పెట్టినా చంద్రబాబు నాయుడు వెంట నడుస్తామని ఆయన తెలియపరిచారు. చంద్రబాబు సభకు వస్తున్న జన సందోహాన్ని చూసి సీఎంకు నిద్ర పట్టడం లేదని ఆయన తెలియజేశారు. అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

మిట్స్‌లో మేరీమట్టి-మేరా దేశ్

విశాలాంధ్ర -మదనపల్లి: మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల లో మేరీ మట్టి మేర దేశ్ కార్యక్రమాన్ని కళాశాల యెన్.ఎస్. ఎస్ వారు ఘనంగా నిర్వహించారు. అమర జవాన్లు, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పౌరులను గౌరవించుకోవడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్వాతంత్ర్య దినోత్సవం (ఆగస్టు 15) వరకూ దేశవ్యాప్తంగా మేరీ మాటీ మేరా దేశ్ (నా మట్టి.. నా దేశం) పేరుతో అమరవీరుల జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో భాగంగా కురబలకోట మండలం కు చెందిన మన అమర వీరుడు సాయి తేజ్‌ను కళాశాల నందు తలుచుకుంటూ ఆయన సేవలను విద్యార్థులకు మరియు యెన్.సి.సి క్యాడెట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ తెలియజేసారు. దేశ రక్షణ కై ప్రాణాల సైతం లెక్క చేయకుండా సేవలు అందిచారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సాయి తేజ కుటుంబ సభ్యులను గౌరవముగా సత్కరించారు. కురుబలకోట తహసీల్దార్ భీమేశ్వర రావు మాట్లాడుతూ యువత మేరీ మట్టి మేర దేశ్ కార్యక్రమం లో పాల్గొని పంచప్రాన్ ప్రతిజ్ఞ చేయించారు. స్వాతంత్ర సమర యోధుల జ్ఞాపక%శీ% గా తరగతి గదులకు నామకరణం చేశారు. చివరిగా వసుధ వందన్ కార్యక్రమం లో భాగంగా మొక్కలను కళాశాల ఆవరణం నాటారు. కార్యక్రమం లో యెన్.ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజేష్, యెన్.సి.సి లెఫ్టనెంట్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నాగరాజునాయుడు

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : నాగరాజునాయుడు శుక్రవారం భాధ్యతలు చేపట్టారు. ఈయన తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చి ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ ను కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఘనంగా సత్కరించారు.ఈ సంధర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అందరం కలిసి సమన్వయంతో పనిచేసి డిగ్రీ కళాశాల ఆశయా లు సాధించాలన్నారు. కళాశాలను అభివృద్ధి చేయడమే కాకుండా ప్రయివేటు కార్పోరేట్ కళాశాలకు దీటుగా ఉత్తీర్ణత శాతం సాధిద్దామని కోరారు. ఇక్కడ ప్రిన్సిపాల్ గా డాక్టర్ ఎం.శ్రీలత విధులు నిర్వహిస్తూ శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కు బదిలీ అయ్యారు. అధ్యాపకుల బృందం డాక్టర్లు మోషే, దయానందం, రమేష్, సుబ్రమణ్యంరాజు, ప్రేమలత, ఫిజికల్ డైరెక్టర్ శ్రావణి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, పెంచలయ్య, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ పోటీల్లో విజయభారతి విద్యార్థిని సత్తా
జాతీయస్థాయిలో ఏడవస్థానం కైవసం చేసుకున్న ఏపీ జట్టు

విశాలాంధ్ర-మదనపల్లె : జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం లోని విజయభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని జస్నీ సాహితీ సత్తా చాటింది. జార్కండ్ రాష్ట్రంలో జరిగిన ఈ పోటీల్లో ఏపీ నుండి 12 మంది క్రీడాకారి ణులు హాజరు కాగా,అందులో సాహితీ ఒకరు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు మాట్లాడుతూ 12 మంది సభ్యులతో కూడిన ఏపీ బాస్కెట్ బాల్ జట్టు జాతీయస్థాయిలో ఏడో స్థానంలో నిలవడం, అందులో తమ పాఠశాల విద్యార్థిని సాహితీ ఉండడంగర్వకారణ మన్నారు. తమ పాఠశాల విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించడం ఆనందంగా ఉందన్నారు.మా పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహిస్తున్నాము అన్నారు. అనంతరం జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన సాహితీని ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో క్రీడల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.

వీల్ చైర్ వితరణ

విశాలాంధ్ర-పీలేరు:- పీలేరు పట్టణంలోని కోట పల్లి వద్ద ఉన్న మౌర్య కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో వికలాంగుల కొరకు ప్రత్యే కంగా వీల్ చైర్ ను పీలేరు ఆర్టిసి డిపో మేనేజర్ బండ్ల కుమార్ కు అందజేశారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ మౌర్య కంటి ఆసుపత్రి వైద్యులు నిర్వాహకులు మంచి ఆలోచనతో వికలాంగుల కొరకు వీల్ చైర్ ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. అను నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే పీలేరు బస్టాండ్‌లో బస్సుల కోసం వికలాంగులు వేచి చూసిన వారు బస్సు, ఎక్కాలన్న,వెళ్లాలన్న చాలా ఇబ్బందులు పడేవారని దీంతో వీల్ చైర్ ఏర్పాటు చేయడం వల్ల వికలాంగులకు సకాలంలో బస్సును ఎక్కించి వారి గమ్యస్థానాన్ని చేరుకునే విధంగా ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు.

పీలేరులో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం

విశాలాంధ్ర-పీలేరు:- పీలేరు మండల వ్యవసాయ కార్యాలయంలో నిర్వహిం చారు.ఈ సమావేశంలో ఏ.డి. ఏ వై.వి రమణ రావు మాట్లాడుతూ ఖరీఫ్ 2023 లో వేరుశనగ వేసుకోలేని రైతులు ప్రత్యామ్నాయ పంటగా ఉలవలు సెప్టెంబర్ నెలలో విత్తుకోవాలని 80% రాయితీతో రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంటాయని, రైతు భరోసా కేంద్రాలలో ఉన్న ఎరువులు వినియోగించుకోవాలని ఉలవలు, అలసందలు ,చిరుధాన్యాల వంటి తక్కువ ఖర్చులతో కూడిన పంటలను పండించుకుంటే రైతులు మరింత లాభం పొందుతారని తెలిపారు.పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి కె. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ చాఫ్ కట్టర్స్ సబ్సిడీపై అందుబాటులో ఉంటాయని , టీకాల, ఇన్సూరెన్స్ , 1962 సంచార పశు వైద్యశాల గురించి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారిని ఓ . రమాదేవి విద్యుత్ శాఖ ఎ.ఈ పి .వెంకట పురుషోత్తం ,జె.ఈ గోవర్ధన్ , నీటిపారుదల శాఖ ఏఈ ఎం.ఇతి రాజులు, ఏఈఓ నజీర్, అల్తాఫ్, జ్యోష్ణ మాబ్ చైర్మన్ వెంకటరమణారెడ్డి, రత్న శేఖర్ రెడ్డి, అగ్రహారం ఎంపీటీసీ అమర్నాథ్ రెడ్డి, సుధారాణి పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగం మరువలేనిది

విశాలాంధ్ర-నందలూరు :: దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగం మరువలేనిదని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. గురువారం అరవపల్లి జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో నా భూమి నా దేశం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సూర్యనారాయణ మాట్లాడుతూ భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిలు అమరవీరుల త్యాగాన్ని స్మరించుకునే విధంగా దేశవ్యాప్తంగా శిలాఫలకాలను ఆవిష్కరించడం జరుగుతుందన్నారు. అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించి దేశం యొక్క విశిష్టతను తెలియజేశారు. ఇందులో భాగంగా క్రీడామైదానంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు గుణ యాదవ్ నాగిరెడ్డిపల్లి కార్యదర్శి రాజేంద్రప్రసాద్ రెడ్డి ఉపాధి హామీ అధికారులు సిబ్బంది సచివాలయ సిబ్బంది వాలంటీర్లు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహిళకు రక్తదానం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి నందు గర్భిణీ స్త్రీ కి రక్త ము తక్కువతో భాదపడుతునటువంటి మహి ళకు అత్యవసరముగా రక్తం అవసరమవ్వగా డాక్టర్ మైనుద్దీన్‌ని సంప్రదించగా వెను వెంటనే స్పందించి జబివుల్లా అనే యువకుడి చే రక్తదానం చేయించి రక్తదానం చేయించి ఆ మహిళను కాపాడటం జరిగింది. రక్తదానం చేసిన జబివుల్లాకు హృదయపుర్వక కృతజ్ఞతలు, ధన్యవాద ములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షాహీల్, ఖల్లిల్, సభ్యులు, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాతో చిన్నబోతున్న బాహుదా

రసీదుల పేరుతో నిలువు దోపిడీ - ఒక్క ట్రాక్టర్‌కు 1200 వసూలు చేస్తున్న వైనం

విశాలాంధ్ర-సుండుపల్లె : సుండుపల్లె మండలంలోని యర్రమనేనిపాలెం పంచాయతి పరిధిలోని కుప్పగుట్ట నుంచి రాయ వరం పంచాయతిలోని చీనేవాండ్లపల్లే వరకు వున్న బాహుదా నదిలో ఇసుకాసురులు రాత్రంబవళ్ళ తేడా లేకుండా ఇష్టారాజ్యాంగ బాహుదానదిని తోడేస్తున్నారు. సాధారణంగా ఇసుక రీచ్ కు అనుమతిస్తే నదిలో ఇసుక తీసేవారు దారి ఏర్పాటు చేసి అనుమతులు పొందిన వారు అక్కడే ఉండి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుసుము తీసుకుని అనుమ తులివ్వాల్సి వుంటుంది. దీంతో పాటు ఎక్కడో ఒక చోట మాత్రమే అనుమతితో రీచ్ ఏర్పాటు చేయాల్సి వుంది. అయితే సుండుపల్లె మండల పరిధిలో అలాంటిదేమీ లేకుండా ఓ కంపెనీ పేరుతో కొందరు ప్రైవేటు వ్యక్తులు ఒక్కో ట్రాక్టర్ కు 1200రూపాయలు వసూలు చేసుకుంటున్నారు. రాయవరం చీనేవాండ్లపల్లే నుంచి సుండుపల్లె ..పీలేరు రహదారిలోని కాజ్వే వరకు ఎక్కడైనా ఇసుక తరలించు కోవచ్చని రసీదులు ఇస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఆ రసీదులలో వివిధ గ్రామాల పేర్లతో స్టాక్ డీపో అని రాసిస్తుండడం గమనార్హం. ప్రతి రోజూ అక్రమంగా ఇసుక తరలింపు వలన నదీ పరివాహక ప్రాంతంలో వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు అడుగంటి పోయే అవకాశం ఉందని వ్యవసాయ పొలాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేసులు నమోదు చేయిస్తాం - తహసిల్దార్: ఇసుక తరలింపు విషయం తహశీల్దారు దృష్టికి తీసుకెళ్లగా తమ శాఖ ద్వారా బాహుదా నదిలో ఇసుక తరలింపుకు ఎక్కడా అనుమతిలేదని అక్రమంగా ఇసుక తరలించే వారిని గుర్తించి కేసులు నమోదు చేయిస్తామని సుండుపల్లె మండల ఇంచార్జీ తహసిల్దార్ మహేశ్వర రెడ్డి తెలిపారు. కొందరు రసీదులిస్తున్నట్లు గుర్తించామని వాటిపై విచారిస్తున్నట్లు తెలిపారు.

గంగిరెడ్డి భౌతికకాయం వద్ద ఎమ్మెల్యే నివాళులు

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: చెన్నముక్కపల్లె కు చెందిన కొండ్రెడ్డి గంగిరెడ్డి అనారోగ్యంతో గురువారం మృతి చెందారు.శనివారం గంగిరెడ్డి భౌతిక కాయాన్ని ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు.వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు జెడ్ పి టిసి వెంకటేశ్వర రెడ్డి, ఏపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, ఎంపిటిసిలు ప్రభాకర్ రెడ్డి,రామచంద్రా రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

అర్హులైన పేదలకు అసైన్‌మెంట్ భూములు పంపిణి చేయాలి

సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు బి.రామయ్య

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: అర్హులైన పేదలకు అసైన్‌మెంట్ భూములు పంపిణి చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో ఆగస్టు 14వ తేదిన కలెక్టరేట్ వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రామయ్య, ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడులు పేర్కొన్నారు. స్థానిక పెన్నానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు దాటిన ఎన్నికల ముందర హడావిడిగా అసైన్డ్ భూములు పంపిణీకి పూనుకున్న ఈ ప్రభుత్వం ఏకపక్షంగా అధికార పార్టీకి చెందిన వారి అన్యాయులకు అసైన్డ్ భూములు కట్టబెట్టడానికి కమిటీలలో ప్రతిపక్షాలను, ప్రజాసంఘాలను, ప్రజలను మమేకం చేయకుండా ఒంటెద్దు పోకడలతో పోవడం వెనుక ఈ అసైన్డ్ భూములన్ని అసలైన అర్హులకు కాకుండా, అధికార పార్టీ బినామీలకు అందే అవకాశం ఉందని తెలిపారు. అసైన్డ్ భూముల పంపిణి గతంలో నుండి పేదలు, దళితులు, గిరిజనులు, ఇతర వెనుకబడిన తరగతులు వారుగా ఉన్న ప్రజానీకానికి భూములపై లేదా నివాస స్థలాలపై వారి హక్కును కల్పించేటువంటి ఉండేదన్నారు. కానీ ఇవాళ జిల్లాలో చూసుకున్న లేదా ప్రొద్దుటూరు ప్రాంతంలో చూసుకున్న కొంతమంది రెవెన్యూ అధికారులు మరియు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వారు చట్టాలను పక్కనపెట్టిన పేదలకు దక్కాల్సినటువంటి చుక్కల భూములు కావచ్చు, బంజరు భూములు కావచ్చు లేదా పోరంబోకు స్థలాలు కావచ్చు వీటిన్నింటికి సర్వే నెంబర్లు మార్చి అధికార పార్టీకి అనుకూలమైనటువంటి వర్గీయులకు కట్టబెట్టి ఉన్నారని అన్నారు. ఈ దశలో సీపీఐగా అర్హులైన పేదలకు అసైన్డ్ భూములు దక్కాలని అందుకుగాను ఆ కమిటీలలో అన్ని రాజకీయ పార్టీలను భాగస్వామ్యం చేస్తూ చట్టం యొక్క ఉద్దేశ్యాన్ని నీరుగార్చకుండా కాపాడాలని కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి షరీఫ్, సమితి సభ్యులు వై.హరి, మచ్చశ్రీను, యేసోబు, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి సందీప్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ విద్యతో బోధనలో నూతనత్వం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: విద్యార్థులకు అత్యున్నతస్థాయి బోధన ద్వారా గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దడానికి పాఠశాలలో డిజిటల్ విద్యకు శ్రీకారం చుట్టామని ప్రధానోపాధ్యాయులు నర్సింహారెడ్డి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఉన్న 6 నుంచి 10వ తరగతి వరకు ఉన్న తరగతి గదుల్లో 9 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ)ను, 3 నుంచి 5 వ తరగతి వరకు ఉన్న తరగతి గదుల్లో 3 స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ కష్టమైన పాఠ్యాంశాలు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేందుకు డిజిటల్ విద్య తోడ్పడుతుందన్నారు. దేశంలోనే మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి డిజిటల్ విద్యకు శ్రీకారం చుట్టారన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్యాబోధన ఉందన్నారు. విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించేందుకు డిజిటల్ విద్యా బోధన తోడ్పడుతుందన్నారు. డిజిటల్ పరికరాల ద్వారా పాఠ్యాంశాలను చిత్రాలు, వీడియోల రూపంలో ఉపాధ్యాయులు అర్థవంతంగా బోధించడం వల్ల చదువు పట్ల విద్యార్థులలో ఆసక్తి పెరుగుతుందన్నారు. ముఖ్యంగా సైన్స్ ప్రయోగాలు, మానవుని గుండె పనితీరు, మెదడు నిర్మాణం, మానవుని జీర్ణవ్యవస్థ డిజిటల్ విద్య ద్వారా సులువగా అర్థం అవుతాయన్నారు. సోషల్ పాఠాలకు సంబంధించి మనం నేరుగా చూడలేని సముద్రాలు, అగ్నిపర్వతాలు, ఖండాలు, వివిధ గ్రహణాలు లాంటి అదనపు సమాచారం కూడా చక్కగా నేర్చుకోవచ్చన్నారు. అంతేకాక డిజిటల్ విద్యాబోధన ద్వారా వెనకబడిన విద్యార్థులు సులభంగా పాఠ్యాంశాన్ని అర్థం చేసుకుంటారన్నారు. ఈ విద్యా విధానం వలన పాఠశాలలకు విద్యార్థుల హాజర శాతం కూడా పెరుగుతుందన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులను సమన్వయం చేసుకొని విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రెడ్డయ్యరెడ్డి, వెంకట్రామరాజు, విజయసారధి రెడ్డి, జయరాంనాయక్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బండ్ల వెంకటేశ్వరరావు (బాబు)పై దాడి ఖండిస్తున్నాం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం కడప కార్యాలయం లోని మీడియా సమావేశంలో బిసి సంక్షేమ సంఘం చేనేత రాష్ట్ర అధ్యక్షులు ఓర్సు వీరభాస్కర్ మాట్లాడుతూ చీరాల చేనేత వర్గాలకు చెందిన బండ్ల వెంకటేశ్వర రావు బాబుపై బాపట్ల జిల్లా చీరలా లోని వైసిపి ఎమ్మెల్యే అనుచరులు దాడి చేయడంపై (ఆంధ్రప్రదేశ్)బిసి సంక్షేమ సంఘం చేనేత రాష్ట్ర సమితి తరుపున తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ దాడిలో యావత్ ఈ మధ్య కాలంలో తరుచుగా నేతన్నాలు త్రీవమైన దాడులు వైఎస్ సిపి నాయకులు వారి కార్యకర్తలు చేనేత కార్మికులపై యాజమానులు-నేతన్నాలుపై దాడులు చేస్తున్నారు. గతంలోనే ఆరు నెలలు క్రితమే అన్నమయ్య జిల్లా మదనపల్లె నియోజకవర్గం పరిధిలోని స్థానిక నీరుగట్టువారిపల్లె సిల్కుటౌవన్ మదనపల్లె శాసనసభ సభ్యులు నవాజ్‌భాషా నీరుగట్టువారిపల్లె సిల్కుటౌవన్ చెందిన శిబ్యాల లక్ష్మీనారాయణ పై మొన్నటిదాకా ఆలయ సిల్క్ హౌస్ అవినాష్ అనే వైసిపి నేత మన సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం పరిధిలోని ఆనంద్. శశి వారిపై కుడా అవమానకరంగా శిక్షించటం జరిగింది. గురువారం సాయంత్రం సమయంలో చీరాలకు చెందిన చేనేత వర్గానికి చెందిన బండ్ల వెంకటేశ్వర రావు(బాబు)పై వైసీపీ నాయకులు ఇంత నీచంగా ప్రస్తావించిన దాడులు చేస్తున్నారు. రాష్ట్రంలో ఈ దాడులకు దుర్మార్గం దౌర్జన్యాలు పాల్పడుతున్నారు. ఇది చాలా భాదాకరం ఈ దాడి దుర్మార్గం దౌర్జన్యం అని ఎక్కడ అయితే చేనేత లు ఉన్నారో అక్కడ తమ రాజకీయాంగా అణచివేతకు గురిచేస్తున్నారు. మా చేనేతల ఓట్లు వేసి మీరు గెలిచారు కానీ మాపైనే దాడులు మా మెతక వైఖరి చూసుకుని అగ్రవర్ణ పార్టీనాయకులు రెచ్చిపోతున్నారు. గత భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులు పై ఇలాంటి దాడులుజరగకుండా చూసుకోవాలని ఈ మధ్య కాలంలో దాడులు చేసినా వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా చర్యలు తీసుకోవాలని లేకపోతే అన్ని చేనేత కుల సంఘాలు ఒక్క తాటికి ఏకమై ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెబుతామని కోరుతు అలా లేకపోతే అందరము కలసి ఏకమై రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికులు రానున్న కాలంలో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరిక చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం చేనేత యువజన విభాగం జిల్లా కార్యవర్గ సభ్యులు బాబ్ జాన్, శివరాం ప్రసాద్, లక్ష్మిదేవి. సుశీలమ్మ. తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించాలి: కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: జిల్లా ప్రజలందరిలో దేశభక్తి భావాలు రేకెత్తించేలా పంద్రాగస్టు వేడుకలను పెద్దఎత్తున చేపట్టేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వివిధ శాఖల జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రం, రాయచోటి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలపై సంబంధిత జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ గిరీషా పిఎస్ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఏర్పాటైన తర్వాత రెండవసారి జిల్లా కేంద్రంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోబోతున్నాం అన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కనువిందు చేసే రీతిలో నిర్వహించాలని ఆయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. దేశభక్తి ఉట్టిపడేలా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. శకటాలను ఓవరాల్ గా కోపరేటివ్, పరిశ్రమల శాఖ జిల్లా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రభుత్వ శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా అభివృద్ధిపై సందేశ బుక్‌లెట్‌ను సిద్ధం చేయాలని డీఐపీఆర్‌ఓను ఆదేశించారు. స్వాతంత్ర్య సమరయోధులకు, జిల్లా ప్రజాప్రతినిధులకు, అధికారులకు వేర్వేరుగా ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓకు సూచించారు. అత్యంత ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాల జారీకి జాబితాను సిద్ధం చేయాలని డిఆర్ఓ ను ఆదేశించారు. అనంతరం జిల్లా ఎస్పీతో కలిసి పరేడ్ గ్రౌండ్ ను సందర్శించి వివిధ శాఖల అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, ఎస్పీ గంగాధర్ రావు, డిఆర్ఓ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వైకాపా గెలుపు వరమా.. శాపమా..

తెదేపా ప్రభుత్వంలో ప్రారంభిస్తే పూర్తి చేయరా

ఎమ్మెల్యే హామీలు గాలికేనా -కలగానే రోళ్ల మడుగు నీటి పథకం

విశాలాంధ్ర -సుండుపల్లె : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు సుండుపల్లి మండల ప్రజలకు శాపంగా మారిందా.. అంటే అవును అని మండల ప్రజలు చెప్పుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత వైకాపా రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి సుండుపల్లి మండలంలోని సుమారు 250 పల్లెలకు ఇంటింటికి తాగునీటి కులాయి ఏర్పాటు చేసి నీటిని అందించాలన్న సంకల్పంతో రోళ్ళమడుగు నీటి పథకాన్ని ఎంతో ఘనంగా ప్రారంభించారు. కడప జిల్లా కలెక్టర్ సత్యనారాయణ ఎమ్మెల్యే మేడాల చేతుల మీదగా ప్రజాప్రతినిధులు అధికారుల సమక్షంలో వందల మంది ప్రజల సాక్షిగా ఈ నీటి పథకానికి భూమి పూజ చేసి ప్రారంభించారు. అదే అదునుగా ప్రభుత్వం నుండి తక్షణం నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించి 60 శాతం పైపులైన్, ట్యాంకుల నిర్మాణం పనులను తెలుగుదేశం ప్రభుత్వంలో పూర్తి చేశారు. అప్పటి రాజకీయ పరిస్థితుల రీత్యా ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి టిడిపి నుండి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. 2019 ఎన్నికల్లో ఊరువాడ తిరిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తానని డప్పు కొట్టి మరి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలోనే ప్రారంభించారు కదా మళ్లీ ఓటు వేస్తే తక్షణమే తాగునీటిని అందిస్తారన్న భ్రమతో మండల ప్రజలు ఏకంగా ఒక్క సుండుపల్లి మండలంలోని సుమారు పదివేల ఓట్ల మెజారిటీతో ఘన విజయాన్ని అందించారు. గెలిచి నాలుగు సంవత్సరాలు పూర్తి అయిన ఇప్పటివరకు రోళ్ల మడుగు నీటి పథకం పనులు ప్రారంభం చేయడం కాకపోయినా కనీసం చేస్తామన్న మాట కూడా చెప్పకపోవడం హాస్యస్పదంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్ధాంతరంగా పైపులైను పనులు ఆగిపోవడం ఉత్సవ విగ్రహాల ట్యాంకుల నిర్మాణం ఎక్కడికక్కడ దర్శనం ఇస్తుండడం చూస్తుంటే... వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం సుండుపల్లి మండల ప్రజలకు శాపంగా మారిందని అధికార పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నారు. సుమారు 50 కోట్ల రూపాయలు నీటిలో వేసిన పన్నీరుల అయిపోయింది.రెండోసారి ఎమ్మెల్యేగా గెలిస్తే తాగునీరు వస్తుందని, శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని, మండలం అభివృద్ధి చెందుతుందని ఆశించిన మండల ప్రజలకు తీరని ద్రోహం చేశారని టిడిపి,జనసేన, బిజెపి, సిపిఐ నాయకులు దుమ్మెత్తి పోస్తున్నారు. ఇంకేముంది మళ్లీ ఎన్నికలు వచ్చేసాయి మరో మారు మళ్లీ గెలిస్తే 2024 ఎన్నికల తరువాత రోడ్ల మడుగు నీటి పథకం పనులు పూర్తి చేస్తామని హామీలు గుప్పిస్తారా లేదా తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రారంభించిన నీటి పథకం పనులను వైకాపా ప్రభుత్వంలో పూర్తి చేయడం ఒక నేరమని ప్రజలను మభ్యపెడతారా అనేది వేచి చూడాలని ప్రతిపక్ష పార్టీలు జోరుగా విమర్శలు చేస్తు న్నాయి. ఏది ఏమైనా సుండుపల్లె ప్రజలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు చారిత్రాత్మక ద్రోహం చేసిందని జోరుగా విమర్శలు వస్తున్నాయి.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు..ప్రజల సుఖ సంతోషాలే ధ్యేయంగా జగనన్న పాలన

- గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి.

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా, ప్రజల సుఖ సంతోషాలే ధ్యేయంగా జగనన్న పాలన సాగుతోందని వైఎస్ఆర్ సిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. రాయచోటి రూరల్ మండలం చెన్నముక్కపల్లె 1 సచివాలయ పరిధిలో శుక్రవారం రెండవ రోజు నిర్వహించిన గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో జెడ్ పి టిసి వెంకటేశ్వర రెడ్డి, ఏపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, స్టేట్ సివిల్ సప్లైస్ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, మండల బిసి నాయకుడు పల్లపు రమేష్, ఎంపిటిసిలు ప్రభాకర్ రెడ్డి, రామచంద్రా రెడ్డిలతో కలసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. పూల తోట హరిజనవాడ, చెన్నముక్కపల్లె, యానాది కాలనీ, కొలిమి మిట్ట లలో ప్రతి ఇంటి గడపకు శ్రీకాంత్ రెడ్డి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ, సమస్యలపై ఆరా తీస్తూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గూర్చి ప్రజలనడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి అక్కడే ఉన్న అధికారుల ద్వారా పరిష్కార మార్గాన్ని చూపిస్తున్నారు. వీధులలో నెలకొన్న సనస్యల పరిష్కారంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికే గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన సాగుతోందన్నారు. ఎన్నికలలోనూ, మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో దేశంలోనే ఆదర్శంగా సీఎం జగన్ నిలుస్తారన్నారు.

నవరత్నాల పథకాలతో గడప గడపనా సంతృప్తి:

అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఆసరా, చేయూత, తదితర పథకాలు సుమారుగా అన్ని ఇళ్లకు అందడంతో గడప గడపనా ప్రజలు శ్రీకాంత్ రెడ్డి ఎదుట సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు లబ్ది అందడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. సీఎం జగన్, ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి, ఎంపి మిథున్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

దళితుల మనోభావాలను దెబ్బతీసిన చంద్రబాబు, లోకేష్ లు:

దళితుల మనోభావాలను చంద్రబాబు, లోకేష్ లు దెబ్బతీసారని పూల తోట హరిజన వాడ వాసులు ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి ఎదుట గుర్తు చేసుకున్నారు. గతంలో దళితులలో ఎవరు పుట్టాలని కోరుకుంటారని మాట్లాడారని, ఇప్పుడు లోకేష్ దళితులు ఏమి పీకుతారంటూ మాట్లాడారని ఆ ప్రాంతాల ప్రజలు గుర్తు చేసుకున్నారు.

ప్రతి అక్కచెల్లెమ్మల నోట జగనన్న మాట...:

ఎంఎల్ఏ శ్రీకాంత్ రెడ్డి పాల్గొంటున్న గడప గడప కు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రతి ఇంటా మహిళల నుంచి ఆత్మీయ స్వాగతాలు లభించాయి. జగన్ ప్రభుత్వం అందచేస్తున్న పథకాలను ఎంఎల్ఏ కు వివరిస్తూ తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నామని సంతోషం వ్యక్తం చేశారు. పూలతోట హరిజన వాడలో ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు ను శ్రీకాంత్ రెడ్డి సందర్శించారు.

- పూలతోట హరిజనవాడ లో వుండే బత్తిని తులసమ్మ కి వైయస్సార్ పింఛన్ వైయస్సార్ వహనమిత్ర వైయస్సార్ చేయూత పథకాలు వచ్చాయన్నారు. మాకు చాలా సంతోషంగా వుంది అన్నారు.

- పూలతోట హరిజనవాడ కు చెందిన సుండుపల్లి అమరావతికి జగనన్న వసతి దీవెన జగనన్న విద్యాదివేనా వైయస్సార్ ఆసరా ద్వారా మూడు లక్షల వరకు లబ్ది పొందా మన్నారు.

- పూలతోట హరిజనవాడ కు చెందిన వి.రాజమ్మ జగనన్న అమ్మఒడి వైయస్సార్ పింఛన్, జగనన్న విద్యాదివేనా, వైయస్సార్ చేయూత ద్వారా మాకు జగనన్న ప్రభుత్వం లో చాలా మేలు జరిగిందన్నారు.

ఆత్మీయ స్వాగతాలు: శ్రీకాంత్ రెడ్డికి ప్రతిపల్లెనా ప్రజలు ఆత్మీయ స్వాగతాలు పలికారు. గజమాలలు వేసి సత్కరించారు. మహిళలు కర్పూర హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మల్ రెడ్డి, స్తానిక నాయకులు మురికినాటి వెంకట రామిరెడ్డి, జాఫర్ అలీ ఖాన్, వెంకట రామిరెడ్డి, హరినాధ రెడ్డి, శ్రీనివాసులు, సురేష్ కుమార్ రెడ్డి,దేవరాయలు,అప్పా వెంకట్రామయ్య, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నా భూమి నా దేశం కార్యక్రమం

విశాలాంధ్ర- సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలంలోని మాచిరెడ్డిగారిపల్లి గ్రామ పంచాయతీలో నా భూమి నా దేశం కార్యక్రమాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. నేల తల్లికి నమస్కారం వీరులకు వందనం అని శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. టెంకాయలు కొట్టి ఈ కార్యక్రమాన్ని మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. స్వాతంత్రం కోసం పోరాడి అమరులైన స్వాతంత్ర సమరయోధులను గుర్తుచేసుకొని మొక్కలు నాటారు. జడ్పిటిసి ఇస్మాయిల్, ఎంపీడీవో రామచంద్ర, పిఓపిఆర్డి సురేష్ బాబు, జెసిఎస్ కన్వీనర్ రెహమాన్‌ఖాన్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రామునాయక్, పంచాయతీ కార్యదర్శి భాషా తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్యాలయంలో నా భూమి నా దేశం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అన్నమయ్య జిల్లా రాయచోటి మున్సిపల్ కార్యాలయం నందు నిర్వహించిన నా భూమి నా దేశం కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ భాష పాల్గొన్నారు ఈ సందర్భంగా చైర్మన్ ఫయాజ్ భాష మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణాలు వదిలిన మహనీయులు అమరవీరులు త్యాగం ఎప్పుడు మరువలేమని అన్నారు. ఆజాదికా అమృత మహోత్సవం కార్యక్రమం భాగంగా నా భూమి నా దేశం కార్యక్రమం నేల తల్లికి నమస్కారం వీరులకు వందనం పేరుతో మొక్కలు నాటి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, కౌన్సిలర్ గౌస్ ఖాన్, వైయస్ఆర్ సీపీ నాయకులు ఫయాజ్ అహ్మద్, జానం రవీంద్ర యాదవ్, బుజ్జిబాబు, ఖాదరవల్లి హజరత్, వెంకటేష్, మున్సిపల్ ఆర్ ఐ మల్లికార్జున, మేనేజర్ రాధా, సుబ్బరాయుడు, మాసూమ్ భాష , మౌల మరియు సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇప్పట్లో నా భూమి - నాదేశం

విశాలాంధ్ర-లింగాల: లింగాల మండలం ఇప్పట్ల గ్రామ సచివాలయంలో శుక్రవారం నా భూమి - నాదేశం అను కార్యక్రమం నిర్వహించారు. అజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నా భూమి - నాదేశం శిలాఫలకం ఆవిష్కరించారు. అనతరం మట్టి ప్రమిదలతో ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మొక్కల పెంపకం, వృక్షాల ఆవశ్యకత తదితర అంశాలను ఎంపీడీఓ సురేంద్రనాథ్ వివరించారు. విశిష్ట సేవలందిస్తున్న సేవా సమతి రాజు తదితరులను ఘనంగా సన్మానించారు. అలాగే పార్నపల్లె గ్రామంలో కూడా నా భూమి-నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో సర్పంచు అంకాలమ్మ, మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున, డిటి త్రిభువనరెడ్డి, పులివెందుల స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దొంగ ఓట్లపై అప్రమత్తంగా ఉండాలి

టీడీపీ జమ్మలమడుగు ఇంచార్జ్ భూపేష్‌రెడ్డి

విశాలాంధ్ర-కొండాపురం: దొంగ ఓట్లపై ప్రతి ఒక్క తెలుగుదేశం పార్టీ కార్యకర్త, నాయకుడు అప్రమత్తంగా ఉండాలని జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ నియోజికవర్గ ఇంచార్జ్ దేవగుడి భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి ఓటర్ సర్వే కార్యక్రమంలో ప్రతి గ్రామంలో గ్రామ నాయకుడు, బూతు స్థాయి నాయకులు పాల్గొని యువతకు ఓటు నమోదుపైన అవగాహణ కల్పించాలని, ఓటర్ లిస్టులో డబుల్ ఎంట్రీ, మరణించిన వారి ఓట్లు తొలగించకపోవడం, పెళ్లిళ్లు అయిపోయిన అమ్మాయిల ఓట్లు తొలగించడం లాంటి ప్రక్రియలో జాగ్రత్తగా ఉండి ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేయాలని అన్నారు. అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తే వెంటనే వెంటనే పార్టీ ఇంచార్జ్ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతి ఒక్క కార్యకర్త పార్టీ విజయం కోసం ఒక సైనికుడు లాగా పనిచేయాలని, ప్రతి ఒక్కరిగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీకోసం పనిచేస్తే ప్రతి ఒక్కరికి గౌరవం, న్యాయం దక్కుతుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గండ్లూరు నాగేశ్వరరెడ్డి, రేగడిపల్లె మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, కొండాపురం క్లస్టర్ ఇంచార్జ్ గోరుశెట్టి బాబు, నాగిరెడ్డి, రమణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేస్తే సహించేది లేదు:ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య 88వ వార్షికోత్సవాల సందర్భంగా ఆగస్టు 11 వ తారీఖున అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలో ఐ.కె ఒలంపియాడ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆవరణంలో బహిరంగ సభ ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు జి .ఈశ్వరయ్య మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య 1936 ఆగస్టు 12వ తారీకున బెనారస్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటై దేశంలో అందరికీ విద్య, వైద్యం, న్యాయం కోసం నిలవధిక పోరాటం చేస్తున్నదని అన్నారు. ఇవాళ దేశంలో విద్యారంగాన్ని విచ్చిన్నం చేయడానికి కాషాయ మూకలు నూతన విద్యా విధానాన్ని ముందుకు తీసుకొని వచ్చాయి అన్నారు. యు జి సి, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ,(ఎంసీఐ) లాంటి సంస్థలను నిర్వీర్యం చేస్తూ దుర్మార్గపూరితంగా విద్యార్థుల మెదల్లో హిజాబ్ అంశాలతో విద్యార్థులను వారిలో ఉన్న సృజనాత్మకతను చీకటి రోజుల్లోకి నెట్టివేసే ప్రయత్నం జరుగుతున్నదని వెంటనే విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని సెక్యులర్ భావాలు కలిగిన దేశంలో మతోన్మాదుల ఉన్మాదంతో దేశంలో ప్రజాస్వామ్యం కోరబడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందువల్ల ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ 88వ వార్షికోత్సవాల సందర్భంగా పోరాటాలకు వేదిక కానున్నదని తెలియజేశారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రాథమిక విద్యను మొదలుకొని ఉన్నత విద్య వరకు అమ్ముతున్నాడని విద్యార్థుల తల్లిదండ్రుల కు హామీలు ప్రకటించి జేబుదొంగ ప్రభుత్వముగా మరో చేత్తో లాక్కుంటున్నాడని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు కూడా అందించలేదని అదేవిధంగా వైద్య రంగాన్ని, వైద్య విద్యను అమ్ముకోవడం సమంజసం కాదని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పాలక ప్రభుత్వమా వ్యాపార ప్రభుత్వమా తేల్చుకోవాలి అన్నారు. విద్యార్థుల సంక్షేమంమరిచిపోతే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు . సాంఘిక, సంక్షేమ వసతి గృహాలలో పెండింగ్లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేసి వసతి గృహాలకు శాశ్వత భవనాలను నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐ.కె ఒలంపియాడ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ ఇషాక్ వలి, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు కామ్రేడ్ మహేష్, సిద్దిగాళ్ల శ్రీనివాసులు,మహిళా సమాఖ్య నాయకురాలు సుమిత్రమ్మ, రాయచోటి నియోజకవర్గం ఏరియా కార్యదర్శి లోకేష్, నాయకులు గిరిబాబు, వెంకట కుమార్, వెంకటేష్, లోకేష్ పాల్గొన్నారు.